అన్నింటికీ దాటవేసే సమాధానమే..

● ఐదవ రోజు పోలీసుల విచారణలో ఎంపీ అవినాష్‌రెడ్డి పీఏ రాఘవరెడ్డి

కడప, డిసెంబరు 17 (ఆంధ్రజ్యోతి): సోషల్ మీడియా కేసులో కడప ఎంపీ అవినాష్‌రెడ్డి పీఏ బండి రాఘవరెడ్డిని ఐదవ రోజు పోలీసులు విచారణ సాగించారు. మంగళవారం ఉదయం 10గంటలకు పులివెందుల అర్బన్ పోలీస్‌స్టేషన్‌కు రాఘవరెడ్డి విచారణకు వచ్చారు. ఈ సందర్భంగా పులివెందుల అర్బన్ సీఐ నరసింహులు, ఎస్‌ఐతో కలసి ఉదయం నుంచి సాయంత్రం వరకు విచారించినట్లు తెలిసింది. వీరితో పాటు డీఎస్పీ మురళీనాయక్ కూడా విచారించినట్లు సమాచారం. ఈ విచారణలో గత నాలుగు రోజులుగా ఎలాంటి సమాధానాలు చెబుతున్నారో అలాంటి సమాధానమే పోలీసులకు ఇచ్చినట్లు సమాచారం. ఐదు రోజుల విచారణలో పోలీసులు రాఘవరెడ్డిని సెల్‌ఫోన్, సిమ్ కార్డు, పాస్‌పోర్టులు ఇవ్వాలని అడిగినట్లు తెలిసింది మంగళవారం ఇవే ప్రశ్నలతో పోలీసులు విచారణ ప్రారంభించినట్లు సమాచారం. వీరికి రాఘవరెడ్డి నుంచి తెలియదు, రేపు చెబుతాను అనే సమాధానం ఇచ్చినట్లు తెలిసింది. 21వ తేదీ మళ్లీ విచారణకు రావాలని రాఘవరెడ్డికి పోలీస్‌స్టేషన్‌లోనే పోలీసులు సమాచారం ఇచ్చారు. పోలీసులకు వస్తానని చెప్పినట్లు తెలిసింది. అలాగే 21వ తేదీ సెల్‌ఫోన్, సిమ్‌కార్డులు, పాస్‌పోర్టు తదితర వాటితో విచారణకు హాజరు కావాల్సిందేనని పోలీసులు సూటిగా చెప్పినట్లు తెలిసింది. సోషల్ మీడియాలో వర్రా రవీందర్‌కు పలు పోస్టుల విషయమై రాఘవరెడ్డి కంటెంట్ ఇచ్చినట్లు పోలీసుల విచారణలో వెల్లడించినట్లు వార్తలు వస్తున్నాయి. ఈ తరుణంలోనే రాఘవరెడ్డిపై పోలీసులు కేసు నమోదు చేశారు. ఇందులో భాగంగానే రాఘవరెడ్డిని కడపలో నాలుగు రోజుల పాటు విచారించగా ఐదవ రోజు పులివెందులలో విచారణ చేపట్టారు. కానీ రాఘవరెడ్డి ఎలాంటి విషయాలను బయటకు చెప్పకుండా దాటవేసే సమాధానాలే చెబుతూ వచ్చినట్లు తెలిసింది. కాగా మంగళవారం రాత్రి 8గంటల ప్రాంతంలో పులివెందుల అర్బన్ పోలీస్‌స్టేషన్‌లో విచారణ అనంతరం బయటకు వచ్చిన రాఘవరెడ్డిని విలేకరులు ప్రశ్నించగా.. పోలీసులు అడిగిన ప్రశ్నలకు సమాధానమిచ్చానన్నారు.

పోలీసు కస్టడీకి వర్రా రవీందర్‌రెడ్డి

● 19, 20న విచారణకు అనుమతి

● విశాఖపట్నం జైలు అధికారులకు ఆదేశాలు

కడప రూరల్, డిసెంబరు 17 (ఆంధ్రజ్యోతి): వైసీపీ సోషల్ మీడియా జిల్లా కో-కన్వీనర్ వర్రా రవీందర్‌రెడ్డి కస్టడీ రివిజన్ పిటీషన్‌పై సోమవారం ఏపీపీ వినిపించిన వాదనను ఎస్సీ, ఎస్టీ కోర్టు (నాల్గవ అదనపు జిల్లా న్యాయస్థానం) పరిగణలోకి తీసుకుంది. ఇదివరకు ఇచ్చిన ఆర్డర్‌లో మార్పుచేసి నవంబరు 19, 20న విచారణకు అనుమతించింది. విశాఖపట్నం సెంట్రల్ జైలు అధికారులకు వర్రాను కస్టడీకి అప్పగించాలని ఆదేశించింది. ఉదయం 9 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు విచారణను కొనసాగించాలని పేర్కొంది. వీడియో చిత్రీకరణతో పాటు న్యాయవాదుల సమక్షంలో విచారించాలని, విచారణకు ముందు, తరువాత మెడికల్ పరీక్షలు చేయించాలని, థర్డ్‌డిగ్రీ మెథడ్‌ను ఉపయోగించరాదని ఆర్డర్‌లో పేర్కొంది.

వర్రా కస్టడీకి పోలీసుల చర్యలు

కడప సెంట్రల్ జైలులో రిమాండ్ ఖైదీగా ఉన్న వర్రా రవీందర్‌రెడ్డిపై విశాఖపట్నంలో నమోదైన ఓ కేసులో అక్కడి కోర్టు రిమాండ్‌కు ఆదేశించడంతో విశాఖపట్నం సెంట్రల్ జైలుకు తరలించారు. ఈ క్రమంలో కడప ఎస్సీ, ఎస్టీ నాల్గవ అదనపు జిల్లా న్యాయస్థానంలో దాఖలైన పోలీసు కస్టడీ పిటీషన్‌పై వర్రాను 19, 20న కస్టడీకి అప్పగిస్తూ మంగళవారం విశాఖపట్నం జైలు అధికారులకు ఆదేశాలు జారీ చేసింది. ఈ ఆదేశాలతో వర్రాను విచారించేందుకు పోలీసులు తగు చర్యలకు ఉపక్రమించారు.



వైసీపీ అధినేత వైఎస్ జగన్‌కు కడప వైసీపీ కార్పొరేటర్లు భారీ ఝలక్ ఇచ్చారు. టీడీపీ వచ్చిన ఆరు నెలల తర్వాత ఏకంగా 8 మంది కార్పొరేటర్లు ముఖ్యమంత్రి చంద్రబాబు సమక్షంలో తీర్థం పుచ్చుకోవడం వైసీపీలో అలజడిరేపింది. జగన్ సొంత జిల్లాలోనే కార్పొరేటర్లు సైకిలెక్కేసి మేయర్ పీఠం టీడీపీ పరమైతే.. ఇది స్టేట్‌లో పెద్ద మైనస్ కావడమే కాకుండా.. పార్టీ భవిష్యత్తుపైనే పడి కేడర్ పునరాలోచనలో పడుతుందంటారు. అందుకే నష్టనివారణకు జగన్ ఎంపీ అవినాష్ రెడ్డిని రంగంలోకి దింపి అసంతృప్త కార్పొరేటర్లు, ఇతర నేతలను బుజ్జగించాలని ఆదేశించినట్లు వైసీపీ వర్గాలు చెబుతున్నాయి.

6

● టీడీపీ వైపు చూస్తున్న కార్పొరేటర్లు
● ఇప్పటికే 8 మంది చేరిక
● మరో 11 మంది చేరేందుకు సిద్ధం
● నష్ట నివారణకు రంగంలోకి దిగిన వైసీపీ అధినేత
● అసంతృప్త కార్పొరేటర్ల బాధ్యత ఎంపీ అవినాష్‌కు అప్పగింత
● ఇప్పటికే ఒకసారి అవినాష్ చర్చలు.. మళ్లీ ఫోన్‌లు

జగన్‌కు.. ఝలక్



కడప, డిసెంబరు 17 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో ఇప్పటికే సీఎం చంద్రబాబు సమక్షంలో 7 మంది సైకిలెక్కితే అంతకు మునుపు ఓ కార్పొరేటర్ తీర్థం పుచ్చుకున్నారు. మొత్తం 8 మంది కార్పొరేటర్లు టీడీపీ గూటికి చేరడం వైసీపీ వర్గాల్లో కలకలం రేపింది. మరో 11 మంది కార్పొరేటర్లు నెక్స్ వీక్ సైకిలెక్కడం ఖాయమనే ప్రచారం సాగుతోంది. సొంత జిల్లాలోనే కార్పొరేటర్లు సైకిల్ ఎక్కితే పరిస్థితి ఏంటి. ఇప్పటికే ప్రొద్దుటూరులో కౌన్సిలర్లు కూడా టీడీపీ గూటికి చేరారు. సొంత జిల్లాలోనే డ్యామేజీ అయితే దీని ప్రభావం భారీగా ఉంటుందని వైసీపీ శ్రేణులు ఆందోళన వ్యక్తం చేస్తున్నాయి. ఇపుడు ఈ వ్యవహారం జిల్లాలో కాకరేపుతోంది.

మూడుముక్కలాట

కడప కార్పొరేషన్‌లో మాజీ డిప్యూటీ సీఎం అంజాద్‌బాష, మేయర్ సురేష్ బాబు, వైసీపీ జిల్లా అధ్యక్షుడు రవీంద్రనాథరెడ్డిల మధ్య మూడుముక్కలాట సాగుతోంది. కడప అసెం బ్లీ నుంచి పోటీ చేయాలనేది రవీంద్రనాథరెడ్డి చిరకాలవాంఛ అంటారు. ఇక మేయర్ సురేషబాబు కూడా వైఎస్ కుటుంబం వెంటే ఎన్నోఏళ్లుగా నడుస్తున్నారు. రెండుసార్లు మేయర్‌గా, జిల్లా అధ్యక్షుడిగా పనిచేశారు. ఈయనకు కూడా కడపలో పోటీ చేయా లనేది కోరిక. అంజాద్‌బాష రెండుసార్లు ఎమ్మెల్యేగా గెలుపొందారు. ఈ ముగ్గురికి కడప టికెట్‌పైనే ఆశ. మేయర్ సురేష్‌బాబు, అంజాద్‌బాష ఒక జట్టుగా ఉంటారంటారు. జిల్లా అధ్యక్షుడు రవీంద్రనాథరెడ్డి కడపలో ఒకరుగా ఉంటారు. ఈ ముగ్గురు కడుపులో కత్తులు పెట్టుకొని పైకి కౌగిలించుకుని యాక్షన్ చేస్తారని ఆ పార్టీ వర్గాలే చెబుతుం టాయి. ఈ కార్పొరేషన్‌లో ప్రస్తుతం 50 మంది కార్పొరేటర్లు కాగా ఇద్దరు మరణించారు. ఒక టీడీపీ, మరొక ఇండిపెండెంట్ అభ్యర్థి గెలుపొందారు. ఇండిపెండెంట్ అభ్యర్థి వైసీపీ తీర్థం పుచ్చుకున్నారు. మిగతా కార్పొరేటర్‌లలో మేయర్ సురేష్‌బాబు, అంజా ద్‌బాష, జిల్లా అధ్యక్షుడు రవీంద్రనాథరెడ్డి అనుచరులు ఉన్నారు. ఈ అనుచరులు కూడా పైకి అందరు కలసి ఉన్నా కూడా ఎక్కడైనా మామే వంగతోట కాడ మామ కాదన్నట్లుగా ఎవరివర్గం వారిగా వేర్వేరుగా ఉంటారు.

వైసీపీలో చిచ్చు

వైసీపీకి చెందిన 8 మంది కార్పొరేటర్లు టీడీపీ గూటికి చేరడంతో వైసీపీలో చిచ్చు రేపిందంటారు. జిల్లా అధ్యక్ష పదవి నుంచి సురేష్‌బాబును తప్పించడంతో తట్టుకోలేక కార్పొరేటర్లు టీడీపీ గూటికి చేరారని అతని వర్గీయులు అంటున్నారు. మాజీ డిప్యూటీ సీఎం అంజాద్‌బాష వర్గీయులు కూడా బలపరుస్తున్నారు. మేయర్ సురేష్‌బాబు వేధింపుల కారణంగానే కార్పొరేటర్లు టీడీపీకి వెళ్లారని జిల్లా అధ్యక్షుడు రవీంద్రనాథరెడ్డి వర్గీయులు చెబుతున్నారు. ఒకరిపై ఒకరు ఆరోపణలు చేసుకుంటూ వస్తున్నారు. ఇటీవల ఎంపీ అవినాష్‌రెడ్డి కార్పొరేటర్లతో సమావేశం నిర్వహిస్తే కొందరు హాజరు కాలేదు.

జగన్ సీరియస్

కడపకు చెందిన 8 మంది కార్పొరేటర్లు టీడీపీలో చేరడాన్ని వైసీపీ అధినేత జగన్ చాలా సీరియస్‌గా తీసుకున్నట్లు చెబుతారు. సొంత జిల్లాలోనే ఇలా జరిగితే అది పెద్ద డ్యామే జీ అవుతుందని జగన్ శిబిరం ఆందోళన వ్యక్తం చేస్తున్నట్లు అంటున్నారు. మరో 11 మంది కార్పొరేటర్లు టీడీపీలో చేరుతున్నారనే విషయం తెలియడంతో సీరియస్ అయిన అధిష్ఠానం రవీంద్రనాథరెడ్డి, సురేష్‌బాబు, అంజాద్‌బాషాలకు క్లాస్ పీకినట్లు చెబుతారు. కార్పొరేటర్లు పార్టీని వీడకుండా చూడాలని కడప ఎంపీ అవినాష్‌రెడ్డికి జగన్ బాధ్యతలు అప్పగించినట్లు చెబుతారు. దీంతో పార్లమెంట్ సమావేశాల్లో ఉన్న అవినాష్‌రెడ్డి మంగళవారం ఢిల్లీ నుంచే పలువురికి ఫోన్ చేసి.. అసంతృప్త కార్పొరేటర్లతో మాట్లా డినట్లు వైసీపీ వర్గాలు చెబుతున్నాయి. మేయర్ సురేష్‌బాబు, అంజాద్ బాషలకు కూడా పార్టీ మారుతారన్న ప్రచారం ఉన్న కార్పొరేటర్లతో మాట్లాడాలని ఆదేశించినట్లు తెలి సింది. మొత్తానికి కార్పొరేటర్ల ఫిరాయింపు వైసీపీలో అలజడి రేపింది. ఇక ఎవరూ సైకిలెక్కకుండా ఆపేందుకు ప్రయత్నాలు చేస్తున్నారు. ఐదేళ్ల అధికారంలో ఉన్నప్పుడు మమ్మల్ని పట్టించుకోకుండా వదిలేసి ఇపుడు గుర్తుకు వచ్చామా అంటూ కొందరు కార్పొరేటర్లు ఇదే అదునుగా భావించి అసమ్మతిని కక్కుతున్నట్లు చెబుతున్నారు.

శబరిమలకు రెండు ప్రత్యేక రైళ్లు

కడపఎడ్యుకేషన్, డిసెంబరు 17 (ఆంధ్రజ్యోతి): అయ్యప్ప స్వామి భక్తుల కోసం గుంటూరు, కడప మీదుగా మరో రెండు ప్రత్యేక రైళ్లను దక్షిణ మధ్య రైల్వే నడుపుతున్నట్లు కడప రైల్వే సీనియర్ కమర్షియల్ ఇన్‌స్పెక్టర్ జనార్దన్ తెలిపారు. విజయవాడ-కొల్లంల మధ్య డిసెంబరులో ప్రత్యేక రైలు (07177నెంబర్) నడవనుందన్నారు. ఈ రైలు డిసెంబరు 21, 28 తేదీలలో శనివారం రాత్రి 10.15గంటలకు విజయవాడలో బయలుదేరి కడపకు మరుసటి రోజు ఉదయం 9.45 గంటలకు చేరుకొని.. సోమవారం ఉదయం 6.20 గంటలకు కొల్లంకు చేరుకుంటుందన్నారు. తిరుగు ప్రయాణంలో రైలు (07178) డిసెంబరు 23, 30 తేదీలలో సోమవారం ఉదయం 10.45గంటలకు బయలుదేరి కడపకు మరుసటి రోజు ఉదయం 5.40గంటలకు చేరుకుంటుంది. కాకినాడకు అదేరోజు రాత్రి 9గంటలకు రైలు వెళ్లనుందన్నారు. అలాగే మరో రైలు (07183) నరసాపూర్-కొల్లం మధ్య నడపనున్నారన్నారు. ఈ రైలు నర్సాపూర్ నుంచి జనవరి 15, 22 తేదీలలో బుధవారం రాత్రి 9గంటలకు బయలుదేరి మరుసటి రోజు ఉదయం కడపకు 9.45కు చేరుకొని.. శుక్రవారం ఉదయం 5.30కు కొల్లంకు చేరుకుంటుందన్నారు. తిరుగు ప్రయాణంలో 07184 నెంబరు రైలు కొల్లంలో జనవరి 17, 24 తేదీలలో శుక్రవారం ఉదయం 8.40కు బయలుదేరి శనివారం ఉదయం 9.40కు కడపకు చేరుకొని ఆదేరోజు సాయంత్రం 6.30కు నర్సాపూర్‌కు వెళ్తుందన్నారు. ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

ప్రీమియం మద్యం షాపులకు దరఖాస్తుల ఆహ్వానం

కడప (క్రైం), డిసెంబరు 17 (ఆంధ్రజ్యోతి): జిల్లా వ్యాప్తంగా ప్రీమియం మద్యం షాపులకు ఈనెల 17 నుంచి 31వ తేదీ వరకు దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు ఎక్సైజ్ సూపరింటెండెంట్ రవికుమార్ తెలిపారు. తన కార్యాలయంలో మంగళవారం వివరాలను వెల్లడించారు. ఆఫ్‌లైన్ పద్ధతి ద్వారా ఎంపికలు జరుగుతాయన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా 12 ప్రీమియం లిక్కర్ దుకాణాలను ప్రభుత్వం ఏర్పాటు చేస్తుందని, కడప జిల్లాకు ఒకటి కేటాయించడం జరిగిందన్నారు. ప్రీమియం స్టోర్ లైసెన్స్ గడువు 5 సంవత్సరాలు ఉంటుందన్నారు. దరఖాస్తు రుసుము రూ.15లక్షలు డిమాండ్ డ్రాఫ్ట్ ద్వారా తీసుకోవాలని.. ఎంపిక కాకపోతే డబ్బులు తిరిగి వెనక్కు ఇవ్వరని తెలిపారు. ఎంత మంది అయినా దరఖాస్తు చేసుకోవచ్చని తెలిపారు. ప్రీమియం స్టోర్ కనీస వైశాల్యం 4000 చదరపు అడుగులు ఉండాలన్నారు. అలాగే కడప, యర్రగుంట్ల ప్రాంతాలలో రెండు బార్లకు సంబంధించి ఈ నెల 16 నుంచి 22 వరకు దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు ఎస్ఈ రవికుమార్ తెలిపారు. కడప బార్‌కు రూ.కోటి 22 లక్షలు, యర్రగుంట్ల బార్‌కు రూ.55లక్షలు చెల్లించాల్సి ఉంటుంది. ఈ నెల 24వ తేదీ కలెక్టర్ కార్యాలయంలో వేలం ద్వారా ఎంపికలు జరుగుతాయన్నారు.

జిల్లా ఆర్థిక ప్రగతికి బ్యాంకర్ల భాగస్వామ్యం అవసరం

● డీసీసీ, డీఎల్ఆర్సీ సమావేశంలో కలెక్టర్



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ శ్రీధర్ చెరుకూరి

కడప ఎన్టీఆర్‌సర్కిల్, డిసెంబరు 17 (ఆంధ్రజ్యోతి): సమాజ ఆర్థికాభివృద్ధితో పాటు జిల్లా ఆర్థిక ప్రగతిలో బ్యాంకర్ల భాగస్వామ్యం, సహకారం ఎంతైనా అవసరమని కలెక్టర్ డాక్టర్ శ్రీధర్ చెరుకూరి పేర్కొన్నారు. మంగళవారం కలెక్టరేట్‌లోని పీఈఆర్ఎస్ హాల్‌లో కలెక్టర్ అధ్యక్షతన డిస్ట్రిక్ట్ కన్సల్టేటివ్ కమిటీ (డీసీసీ), డిస్ట్రిక్ట్ లెవెల్ రివ్యూ కమిటీ (డీఎల్ఆర్సీ) బ్యాంకర్ల సమావేశం నిర్వహించారు. సమావేశంలో జిల్లాలోని అన్ని బ్యాంకులకు నిర్దేశించిన పలు రకాల రుణ లక్ష్యాలు, సాధించిన ప్రగతిని ఆయా బ్యాంకుల ప్రతినిధులతో సమీక్షించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ రుణాలు అందించడంలో సెప్టెంబరు మాసాంతానికి జిల్లా పురోగమనంలో కొనసాగుతున్నందుకు బ్యాంకర్లను అభినందించారు. బ్యాంకర్లు సమర్థవంతంగా పనిచేస్తేనే ఆర్థిక వ్యవస్థ మరింత దృఢంగా ఉంటుందన్నారు. ప్రధానంగా జిల్లాలో డీఆర్డీఏ, మెప్మా పరిధిలోని అన్ని స్వయం సహాయక సంఘాలను ఆర్థికంగా బలోపేతం చేసి జిల్లా ఆర్థికాభివృద్ధిలో మహిళా సంఘాలను భాగస్వామ్యం చేయాలన్నారు. సీఎం చంద్రబాబు ఆదేశానుసారం వికసిత భారత్ లక్ష్య సాధనలో భాగంగా రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన స్వర్ణాంధ్రప్రదేశ్-2047 దిశగా వైఎస్సార్ జిల్లాను కూడా ముందుకు నడిపించాలన్నారు. అన్ని రంగాల అభివృద్ధికి అపారమైన వనరులు ఉన్న ఆకాంక్ష జిల్లాను రాష్ట్ర, దేశ అభివృద్ధితో పాటు గ్లోబల్ ఎకానమీలో కీలక స్థానంలో నిలపాలని కలెక్టర్ ఆకాంక్షించారు. దేశ ఆర్థిక అభివృద్ధికి ప్రధాన మూలాలు గ్రామ సీమలే అని, అత్యంత సమర్థవంతమైన ఆర్థిక లావాదేవీలు నిర్వహిస్తున్న స్వయం సహాయక సంఘాలే అందుకు ప్రత్యక్ష నిదర్శనమన్నారు. ప్రతి గ్రామంలో ప్రతి ఎస్‌హెచ్‌జీ నుంచి కనీసం ఒక్క మహిళా కుటుంబం ఒక పారిశ్రామికవేత్తగా ఎదగాలని ఆకాంక్షించారు. ప్రతి మండలం నుంచి చురుకుగా ఉన్న స్వయం సహాయక గ్రూపులను గుర్తించి వారిని ఈ-కామర్స్ బిజినెస్‌లోకి అడుగులు వేసేందుకు ప్రోత్సహించాలన్నారు. సమావేశంలో జిల్లా లీడ్ బ్యాంకు చీఫ్ మేనేజర్ జనార్దన్, నాబార్డ్ ఏజీఎం విజయవిహారి, రిజర్వ్ బ్యాంకు ఎల్డీఓ నవీన్‌కుమార్, కెనెరా బ్యాంకు ఏజీఎం మురళీమోహన్, ఎస్‌బీఐ ఏజీఎం వాణికిషోర్‌కుమార్‌రెడ్డి, యూబీఐ ఏజీఎం లక్ష్మి తులసి, ఏపీజీబీ ఏజీఎం శ్రీనివాస ప్రసాద్, కేడీసీసీ సీఈఓ రాజమ్మ, డీఆర్డీఏ, మెప్మా పీడీలు ఆనంద్‌నాయక్, సురేష్‌రెడ్డి, వ్యవసాయ శాఖ జిల్లా అధికారి నాగేశ్వరరావు, పశుసంవర్థకశాఖ జిల్లా అధికారి డాక్టర్ శారదమ్మ, పరిశ్రమల శాఖ జీఎం చాంద్ బాష, వ్యవసాయ అనుబంధ శాఖల అధికారులు, డిక్కీ కోఆర్డినేటర్ శివ శంకర్, వివిధ బ్యాంకుల ప్రతినిధులు పాల్గొన్నారు.


లోపించిన చెత్తశుద్ధి..?

● పల్లెల్లో పడకేసిన పారిశుధ్యం ● చెత్తసేకరణ ఆటోలు, రిక్షాలు మూలకు
● నిర్వహణ లేక తుప్పుపట్టిపోతున్న వైనం ● చేతులెత్తేస్తున్న పంచాయతీలు
● పట్టించుకోని పంచాయతీశాఖ

చెత్త సేకరణ ఆటోలు, రిక్షాలు మూలకు..

జిల్లా వ్యాప్తంగా చెత్త సేకరణ కోసం 44 ఆటోలు కేటాయించగా వాటిలో 27, రిక్షాలలో 1301 వాటికి గాను 50శాతం పనిచేయడం లేదు. మాజీ సీఎం జగన్ సొంతూరు పులివెందులలో మూడు ఆటో రిక్షాలుండగా మూడూ పనిచే యడం లేదు. మండలాల వారీగా ఆటోరిక్షాల పరిస్థితి..

మండలం	కేటాయింపు	పని చేయనివి
బద్వేలు	5	4
సీకేదిన్నె	2	2
చక్రాయపేట	1	1
చెన్నూరు	3	2
దువ్వూరు	1	1
జమ్మలమడుగు	4	3
ఖాజీపేట	3	3
పులివెందుల	3	3
రాజుపాళెం	1	1
సిద్దవటం	4	1
వీఎన్ పల్లె	1	1
వేంపల్లె	2	1
యర్రగుంట్ల	5	3
బి.మఠం	1	1
మైదుకూరు	3	0
పోరుమామిళ్ల	2	0
తొండూరు	1	0
ఒంటిమిట్ట	1	0
గోపవరం	1	0
మొత్తం	44	27



కడపరూరల్, డిసెంబరు 17 (ఆంధ్రజ్యోతి): గ్రామాల్లో పారిశుధ్యం మెరుగు కోసం రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేక శ్రద్ధ తీసుకుంటున్నా.. క్షేత్రస్థాయిలో మాత్రం చర్యలు అంతంతమాత్రంగానే కనిపిస్తున్నాయి. మేజర్ పంచాయతీల్లో కొంత మినహాయిస్తే మిగతా పంచాయతీల్లో పరిస్థితి అధ్వాన్నంగా తయారైంది. జిల్లాలో 35 మండలాల పరిధిలోని 557 గ్రామపంచాయతీలలో 1911 గ్రామాలు ఉండగా వీటిలో 13.40 లక్షల మంది జనాభా ఉన్నారు. పారిశుధ్యం పనులకోసం 1,849 మంది ఉన్నారు. ఇందులో 1,301 మంది గ్రీన్ అంబాసిడర్స్, 548 మంది గ్రీన్ గార్డ్స్‌గా పనిచేస్తున్నారు. జిల్లాలోని ఆయా పంచాయతీలకు పారిశుధ్య నిర్వహణకు రిక్షాలను, ఆటోరిక్షాలను పంపించారు. 35 మండలాలకు 44 ఆటో రిక్షాలతో పాటు, 1,301 రిక్షాలు ఉన్నాయి. అయితే 44 ఆటో రిక్షాలలో 17 మాత్రమే పనిచేస్తుండగా మిగిలిన 27 మూలనపడ్డాయి. అలాగే 1,301 రిక్షాలలో 50 శాతం మాత్రమే పనిచేస్తున్నాయి. మేజర్ పంచాయతీల్లో కొన్ని మినహా మిగతా పంచాయతీల్లో వాటిని మూలన పడేయడంతో అవి తుప్పుపట్టిపోతున్నాయి. దీంతో ప్రజలు పడేస్తున్న చెత్త చాలాచోట్ల పేరుకుపోతోంది.

సక్రమంగా సాగని పారిశుధ్య పనులు

జనాభా ప్రాతిపదికన గ్రామాలకు ఆటో రిక్షాలను పంపించినా పంచాయతీల్లో సిబ్బంది కొరతతో అవి వృధాగా పడి ఉంటున్నాయి. పారిశుధ్య కార్మికులకు 15వ ఫైనాన్స్ నిధుల నుంచి జీతాలు చెల్లించాల్సి ఉంది. అయితే ఆయా గ్రామ పంచాయతీలకు వస్తున్న 15వ ఫైనాన్స్ నిధులు గ్రామ పంచాయతీ అవసరాలకు పోను కార్మికుల జీతాలకు చెల్లించడానికి సరిపోవడం లేదని అంటున్నారు. దీంతో కార్మికులకు సక్రమంగా జీతాలు అందకపోవడంతో వీరు కూడా పారిశుధ్య పనులు సక్రమంగా చేయడం లేదు. దీంతో పల్లెలను పారిశుధ్యలోపం వెంటాడుతోంది. దీనికి తోడు జిల్లాలో ముసురు వానలు కమ్ముకోవడంతో ప్రజలు విషజ్వరాల బారిన పడుతున్నారు.



చింతకొమ్మదిన్నె మండలం బోడెద్దులపల్లెలో దర్శనమిస్తున్న చెత్త

వేధిస్తున్న కార్మికుల కొరత

గ్రామ పంచాయతీలను కార్మికుల కొరత వేధిస్తోంది. 35 మండలాల్లోని 557 గ్రామపంచాయతీలలో 1,911 గ్రామాలు ఉండగా ఇందులో 13.40 లక్షల మంది జనాభా ఉన్నారు. వీరందరికీ కలిపి 1,849 మంది మాత్రమే పారిశుధ్య పనులు చేసేందుకు గ్రీన్ అంబాసిడర్స్ గ్రీన్ గార్డ్స్ ఉన్నారు. వీరిలో 548 మంది గ్రీన్ గార్డ్స్ కేవలం షెడ్స్ నిర్వహణ పనులు చూస్తున్నారు. మిగిలిన 1,301 మంది గ్రీన్ అంబాసిడర్స్ రిక్షాల ద్వారా చెత్తసేకరణ చేస్తున్నారు. అంటే 1000 మందికి ఒక్క గ్రీన్ అంబాసిడర్ మాత్రమే ఉన్నారు. దీంతో వీరికి చెత్తసేకరణ తలకుమించిన భారంగా మారుతోంది. 1000 మంది జనాభాకు కనీసం ముగ్గురు పారిశుధ్య కార్మికులు ఉంటే పారిశుధ్యం మెరుగ్గా ఉంటుందని అంటున్నారు.

పట్టించుకోని పంచాయతీశాఖ

పారిశుధ్య నిర్వహణ కోసం ఏర్పాటుచేసిన ఆటో రిక్షాలు, రిక్షాల నిర్వహణను జిల్లా పంచాయతీశాఖ పట్టించుకోవడం లేదు. జిల్లా వ్యాప్తంగా ఉన్న 44 ఆటో రిక్షాలలో 27 మూలనపడ్డాయి. అలాగే 1,301 గ్రీన్ అంబాసిడర్లకు ఒక్కొక్కరికి ఒక రిక్షాను కేటాయించారు. ఇందులో 50 శాతం మాత్రమే పనిచేస్తున్నాయి. 25 శాతం వాటికి మైనర్ రిపేర్లు చేస్తే వాడుకలోకి వచ్చే అవకాశం ఉంది. అయితే వీటికి మరమ్మతులు చేయకపోవడంతో అవి మూలన పడి తుప్పు పడుతున్నాయి. ఈ కారణంగా పల్లెల్లో చెత్తసేకరణ తూతూమంత్రంగా సాగుతోంది.


ఆటోరిక్షాలపై ఫిర్యాదులు రాలేదు..



జిల్లాలోని ఆయా గ్రామ పంచాయతీల్లో చెత్తసేకరణ కోసం కేటాయించిన ఆటో రిక్షాలు, రిక్షాలు పనిచేయడం లేదని ఎలాంటి ఫిర్యాదులు రాలేదు. పని చేయని ఆటో రిక్షాలకు సంబంధించిన సమాచారాన్ని మా దృష్టికి తీసుకొస్తే వాటి స్థానంలో కొత్తవి ఏర్పాటు చేసేందుకు చర్యలు తీసుకుంటాం. ఒకవేళ మైనర్ రిపేర్లు ఉంటే గ్రామ పంచాయతీ నిర్వాహకులే చూసుకోవాలి.

\- రాజ్యలక్ష్మి, డీపీవో

పారిశుధ్యం పడకేయడంతో ప్రజలు సీజనల్ వ్యాధుల బారిన పడుతున్నారు. ఇప్పటికైనా జిల్లా పంచాయతీ శాఖ అధికారులు పల్లెల్లో పారిశుధ్యంపై ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.



చెన్నూరు మండల కేంద్రంలో తుప్పుపట్టిన చెత్తసేకరించే రిక్షా

బహు సుందరం.. ఈ తామర పత్రం



6 కనువిందు చేస్తున్న బాలపల్లె జలపాతం

బహు సుందరం.. ఈ తామర పత్రం

కడప ఎడ్యుకేషన్, డిసెంబరు 17 (ఆంధ్రజ్యోతి): పౌరాణిక సినిమాల్లో తరచూ మనం చూస్తుంటాం. తామర పువ్వు, తామర ఆకులపై దేవతామూర్తులు దర్శనమిస్తుంటారు. వాటిని చూసి ఎంతో ఆశ్చర్యంతో పాటు ఆనందం కూడా కలుగుతుంది. అయితే అది కేవలం సినిమా జిమ్మిక్స్ అని చెప్పాలి. అయితే కడప యోగివేమన యూనివర్సిటీలో అటువంటి తామరపత్రం దర్శనమిచ్చింది. ఈ తామరపత్రంపై 36 కేజీల బరువున్న అమ్మాయి కూర్చున్నా సరే.. ఆ పత్రానికి ఎటువంటి నష్టం కలగలేదు. ఈ మొక్కను జెయింట్ వాటర్ లిల్లీ అని పిలుస్తారు. ఇది ప్రపంచంలోనే అతిపెద్ద తామర మొక్క అని చెబుతున్నారు. యోగవేమన విశ్వవిద్యాలయం బొటానికల్ గార్డెన్‌లో 2019 జూలైలో పశ్చిమబెంగాల్ రాష్ట్రం కలకత్తా సుభాష్ చంద్రబోస్ బొటానికల్ గార్డెన్ నుంచి ఈ మొక్కను తీసుకువచ్చి నాటారు. ఈ మొక్క ఒక్కొక్కటిగా ఎదుగుతూ ప్రస్తుతం కొలనును పూర్తిగా ఆక్రమించుకుంది. ఈ కలువలతో కొలను ఎంతో సుందరంగా దర్శనిమిస్తోంది. ఇది సువాసన వెదజల్లడంతో పాటు ప్రత్యేక ఆకర్షణగా నిలుస్తోంది.

చరిత్ర తెలుసుకుందాం...

విక్టోరియా అమెజానిక ప్రపంచంలోనే అతిపెద్ద నీటి కలువ ఈ మొక్క. అమెజాన్ నదీ పరివాహక ప్రాంతానికి చెందినది. ప్రధానంగా ఉష్ణమండల దక్షిణ అమెరికాలో పెరుగుతుంది. ఇది గయానా జాతీయ పుష్పం. విక్టోరియా అమెజానిక చాలా పెద్ద ఆకులు కలిగి ఉంటుంది. నీటి ఉపరితలంపై ఐదు నుంచి ఎనిమిది మీటర్ల పొడవుతో నీటిలో ఉన్న కొమ్మపై తేలుతూ ఉంటుంది. పువ్వులు ఉదయం తెల్లగా ఉంటాయి.

అదేరోజు సాయంత్రానికి గులాబీ లేదా ఊదా రంగులోకి మారుతుంటాయి. పువ్వులు అతిపెద్దవి 12 అంగుళాల వ్యాసం కలిగి ఉంటాయి. వీటి ఆకులు మూడు మీటర్ల వరకు వ్యాసం కలిగి ఉంటాయి. తామరాకు 40 కేజీల వరకు బరువును మోస్తాయని వైవీయూ బాటనీ అసోసియేట్ ప్రొఫెసర్ ఎ.మధుసూదన్‌రెడ్డి తెలిపారు.



బాటనీ విద్యార్థులకు ఎంతో ఉపయోగకరం

కడప నగరం యోగివేమన విశ్వవిద్యాలయం బొటానికల్ గార్డెన్‌లో ఉన్న జెయింట్ వాటర్ లిల్లీ మొక్కను ప్రతి ఒక్కరూ చూడాల్సిందే. ఇది బాటనీ విద్యార్థులకు ఎంతో ఉపయోగకరం. ఈ మొక్కతో పాటు ఇంకా అనేక రకాల మొక్కలు అందుబాటులో ఉన్నాయి. వాటిపై విద్యార్థులు అధ్యయనం చేసి విజ్ఞానాన్ని పెంపొందించుకోవచ్చు. ఈ అరుదైన మొక్కను చూసేందుకు ఇతర రాష్ట్రాల నుంచి రీసెర్చ్ స్కాలర్లు, విద్యార్థులు వచ్చి ప్రత్యక్షంగా పరిశీలించి వెళ్తుంటారు.





జెయింట్ లిల్లీ ఆకుపై కూర్చున్న విద్యార్థిని, అవగాహన కల్పిస్తున్న అసోసియేట్ ప్రొఫెసర్ మధుసూదన్‌రెడ్డి

10 ఇసుక ట్రాక్టర్లు పట్టివేత



సిద్దవటం, డిసెంబరు 17 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని టక్కోలి సమీపంలో ఉన్న పెన్నానది నుంచి అక్రమంగా ఇసుక తరలిస్తున్న 10 ట్రాక్టర్లను మండల ఇన్‌చార్జి తహసీల్దారు మాధవీలత సీజ్ చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ రైతుల నుంచి ఫిర్యాదులు అందడంతో టక్కోలి వద్ద పెన్నానదిలో మంగళవారం గాలింపు చర్యలు చేపట్టామన్నారు. కడపకు ఇసుక తరలిస్తున్న 10 ట్రాక్టర్లను స్వాధీనం చేసుకుని పోలీసు స్టేషన్‌లో అప్పగించామన్నారు. ఆర్ఐ ప్రసాద్, స్థానిక పోలీసులు, వీఆర్ఏలు పాల్గొన్నారు.

రాజంపేటలో చైన్ స్నాచర్ల హల్‌చల్

రాజంపేట టౌన్, డిసెంబరు 17 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని బోయనపల్లెలో మంగళవారం చైన్ స్నాచర్లు హల్‌చల్ చేశారు. రైల్వేస్టేషన్ రోడ్డులో వెళుతున్న ఓ మహిళ చైను కోసం ప్రయత్నించి విఫలమయ్యారు. బోయనపల్లె ప్రధాన రహదారిపై వెళుతున్న మరో మహిళపై దాడి చేసి నాలుగు తులాల బంగారు చైనును దొంగలించుకుని పరారయ్యాడు. ఒక్క రోజులోనే వేర్వేరు చోట్ల చైన్ స్నాచర్లు తెగబడడంతో పట్టణవాసులు ఆందోళనకు గురవుతున్నారు..

ఇసుక డంపు సీజ్

గుర్రంకొండ, డిసెంబరు 17 (ఆంధ్రజ్యోతి): ఇసుకాసురులు అక్రమంగా నిల్వ ఉంచిన ఇసుక డంపును పోలీస్, రెవెన్యూ అధికారులు మంగళవారం సీజ్ చేశారు. 'ఈ ఇసుక డంపులు ఎవరివి' అన్న శీర్షికతో ఆంధ్రజ్యోతిలో కథనం ప్రచురితమైన విషయం తెలిసిందే. ఈ క్రమంలో రెవెన్యూ, పోలీసులు తరిగొండ రామానాయునిచెరువు పరిసరాల్లో ఇసుక డంపు లను గుర్తించారు. ఇందులో భాగంగా రుద్రవారిపల్లె సమీపంలోని రైతుల పొలాల వద్ద అక్రమంగా నిల్వ ఉంచిన ఇసుక డంపును సీజ్ చేశారు. ఈ ఇసుక డంపులో సగానికిపైగా ఇసుకను రాత్రికి రాత్రే తరలించేశారు. అలాగే పక్కనున్న మరో ఇసుక డంపులో పూర్తిగా ఇసుకను ఖాళీ చేశారు. దీంతో నాలుగు ట్రాక్టర్ లోడ్ల ఇసుక డంపును అధికారులు సీజ్ చేసి రెవెన్యూ అధికారులకు అప్పగించారు. కాగా పోలీసులు, రెవెన్యూ అధికారులు వస్తు న్నట్లు తెలుసుకున్న ఇసుకాసురులు చెరువులో ఇసుక నింపుతున్న ట్రాక్టర్లతో సహా పరారయ్యారు. కార్యక్రమంలో వీఆర్వో నారాయణ, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.



ఇసుక డంపును సీజ్ చేస్తున్న రెవెన్యూ, పోలీస్ అధికారులు

ఆకతాయిల ఆటలు కట్టిస్తాం.. సీఐ

- బాలికల గురుకుల కళాశాలలో పోలీసుల తనిఖీలు

వాల్మీకిపురం, డిసెంబరు 17 (ఆంధ్రజ్యోతి): వాల్మీకిపురం పట్టణ సమీపంలోని తరిగొండ రోడ్డులో గల ఏపీ మైనార్టీ బాలికల గురుకుల కళాశాలలో శనివారం అర్ధరాత్రి గుర్తు తెలి యని ఆకతాయిలు హల్‌చల్ చేసి కళాశాలలోని బాలికలను బెదిరింపులకు గురిచేశారన్న విషయమై కళాశాల ప్రిన్సిపాల్ రామాంజుల పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ విషయమై మంగళవారం స్థానిక సీఐ ప్రసాద్‌బాబు, ఎస్ఐ చంద్రశేఖర్‌లు కళాశాలలో విస్తృత తనిఖీ లు చేపట్టారు. స్థానిక స్థితిగతులను పరిశీలిస్తూ బాలికల భద్రత విషయమై వివరాలను ఆరా తీశారు. ఈసందర్భంగా సీఐ ప్రసాద్‌బాబు మాట్లాడుతూ కళాశాలలో అర్ధరాత్రి బాలి కలను భయభ్రాంతులకు గురిచేసిన ఆకతాయిల విషయమై నిఘా పెట్టామన్నారు. ఇకపై నిత్యం గురుకుల కళాశాల, హైస్కూల్ ప్రాంతంలో పోలీసుల పర్యవేక్షణ ఉండేలా చర్యలు తీసుకుంటామని తెలిపారు. రోడ్లపై శృతిమించి ద్విచక్రవాహనాలు నడపడం, ఈవ్ టీజింగ్ లాంటి వాటిపై ప్రత్యే నిఘా పెట్టామని, పట్టుబడితే చట్టరీత్యా కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు.



గురుకుల కళాశాలలో తనిఖీ చేస్తున్న సీఐ ప్రసాద్‌బాబు

మాకు తెలుసు.. మేం చూపిస్తాం.. పో!

- దళితులపై డిప్యూటీ తహసీల్దారు ఆగ్రహం
- శ్మశానానికి దారి కోసం కార్యాలయం ఎదుట నిరసన


పుల్లంపేట, డిసెంబరు 17 (ఆంధ్రజ్యోతి) : శ్మశానానికి స్థలం చూపారు. కానీ , అక్కడికి వెళ్లేందుకు దారి చూపాలని, రెండేళ్లుగా ఈ సమస్యపై తహసీల్దారు కార్యాలయం చుట్టూ తిరుగుతున్నామని చొప్పావారిపల్లెకు చెందిన దళితులు కోరగా, మాకు తెలుసు.. మేం చూపిస్తాం..పో.. అంటూ డిప్యూటీ తహసీల్దారు లక్ష్మీప్రసన్న ఆగ్రహం వ్యక్తం చేశారు. మండల పరిధిలోని కొమ్మనవారిపల్లెలో మంగళవారం నిర్వహించిన రెవెన్యూ సదస్సులో ఈ దృశ్యం కనిపించింది. దీంతో అవాక్కైన ఫిర్యాదుదారులు ఇదేమిటని ఆమెను ప్రశ్నించగా, మీరు కలెక్టర్‌తో మాట్లాడుతారా, జేసీతో మాట్లాడుతారా చెప్పండి. ఇప్పుడే ఫోన్ చేస్తానంటూ ఆగ్రహం వ్యక్తం చేశారు. రెండేళ్లుగా ఈ సమస్య పరిష్కారానికి నోచుకోలేదని గ్రామస్తులు ఆవేదన వ్యక్తం చేయగా.. షటప్ అంటూ రెచ్చిపోయారు. అర్జీ ఇచ్చారు.. మిగతాది మేము చూసుకుంటాం. ఎక్కువ మాట్లాడితే పోలీసులను పిలిపిస్తా అంటూ ఫిర్యాదుదారులను భయపెట్టారు. దీంతో దళితులు తమకు న్యాయం చేయాలంటూ నిరసన తెలియజేశారు. దీంతో డిప్యూటీ తహసీల్దారు ఎస్ఐకి ఫోన్ చేసి గ్రామస్తులపై ఫిర్యాదు చేశారు. పుల్లంపేట ఎస్ఐ మోహన్‌కుమార్‌గౌడ్ రెవెన్యూ సదస్సుకు చేరుకుని విచారణ చేశారు.



సచివాలయం ముందు నిరసన తెలియజేస్తున్న దృశ్యం

అనుమానాస్పద స్థితిలో వివాహిత మృతి

బి.కొత్తకోట, డిసెంబరు 17 (ఆంధ్రజ్యోతి): బి.కొత్తకోట మండలంలోని గుమ్మసముద్రం పంచాయతీ గుడ్లవారిపల్లెలో ఓ వివాహిత అనుమానాస్పద స్థితిలో మంగళవారం మృతి చెందింది. పోలీసుల కథనం మేరకు.. గ్రామానికి చెందిన దాసరి జనార్ధన్, విజయనిర్మల (34) భార్యాభర్తలు. విజయనిర్మల పుట్టినిల్లు పీటీఎం మండలంలోని పులికల్లు. వారికి ఓ కుమారుడు, కుమార్తె ఉన్నారు. జనార్ధన్ లారీడ్రైవర్ కాగా, విజయనిర్మల మదనపల్లెలోని ఓ గార్మెంట్స్ ఫ్యాక్టరీలో పనిచేస్తోంది. ఇటీవలి కాలంలో వారి మధ్య కలహాలు మొదలయ్యాయి. ఈ నేపథ్యంలో విజయనిర్మల మంగళవారం తెల్లవారుఝామున ఇంట్లోనే శవమై కనిపించింది. సమాచారం అందుకున్న పోలీసులు సంఘటనా స్థలానికి వెళ్లి పరిశీలించారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం మదనపల్లె ఏరియా ఆసుపత్రికి తరలించారు. మృతురాలి తమ్ముడు హరీష్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు అనుమానాస్పద మృతిగా కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ జీవన్‌గంగాధర్‌బాబు తెలిపారు.



సకాలంలో రుణాలు చెల్లించండి

ఏపీజీబీ రీజనల్ మేనేజరు సుశాంత్‌కుమార్ స్వారో

బ్రహ్మంగారిమఠం, డిసెంబరు 17 (ఆంధ్రజ్యోతి) : ప్రజలు ఆంధ్రప్రగతి గ్రామీణ బ్యాం కు నుంచి తీసుకున్న రుణాలు సకాలంలో చెల్లించి బ్యాంకు అభివృద్ధికి సహకరించాలని రాజంపేట డివిజను రీజనల్ మేనేజరు సుశాంత్‌కుమార్ స్వారో తెలిపారు. మంగళవారం మండలంలోని చెంచయ్యగారిపల్లె, లింగందిన్నెపల్లె, బ్రహ్మంగారిమఠం, మల్లేపల్లె గ్రామాల్లో బ్యాంకుకు అప్పు ఉన్న ఖాతాదారుల వద్దకు రికవరీ కోసం వెళ్లారు. ఈ సందర్భంగా రీజనల్ మేనేజరు మాట్లాడుతూ ఇప్పటి వరకు బ్యాంకు నుంచి రూ.8.90 కోట్లు బకాయిలు ఉన్నాయని, ఈ ప్రజలు ఫిబ్రవరి 28, 2025 వరకు వన్‌టైం సెటిల్‌మెంటు ద్వారా డబ్బులు చెల్లించవచ్చని ఆయన తెలిపారు. గ్రామాల్లో బ్యాంకుకు అప్పు ఉన్న ఖాతాదారులు బ్రాంచ్‌కు వచ్చి తమ బకాయిలు ఎంత ఉన్నాయా అని తెలుసుకుని వన్‌టామ్ సెటిల్‌మెంటు ద్వారా తమ అప్పులు చెల్లించవచ్చన్నారు. అలాగే రైతన్నలు భూమి మీద తీసుకున్న వ్యవసాయ రుణాలు నిర్ణయించిన గడువు తేదీలోపే తమ కంతులు చెల్లించి ప్రభుత్వం నుంచి రాయితీ వడ్డీని పొందాలన్నారు. అలాగే ప్రభుత్వం ద్వారా అమలవుతున్న ఇన్సూరెన్స్ పథకాలు ప్రతి ఒక్కరూ బ్యాంకులో చేసుకోవాలని ప్రజలకు తెలిపారు. అలాగే బంగారుపై అతి తక్కువ వడ్డీతో రుణాలు అందిస్తున్నామని గృహ, వాహనాలకు అతి తక్కువతోనే రుణా లు అందిస్తున్నామన్నారు. ఖాతాదారులకు మెరుగైన సేవలు అందించడమే ఏపీజీబీ లక్ష్యమని రీజనల్ మేనేజరు తెలిపారు. ఈ రికవరీ క్యాంపులో చీఫ్ మేనేజరు కామేశ్వర్‌రావు, సీనియర్ మేనేజరు సుశాంత్, బ్రాంచ్ మేనేజరు బాలాదిత్య ఫీల్డ్ ఆఫీసర్లు రాము, ఎస్‌కే అక్బర్, సురేంద్ర, బ్యాంకు సిబ్బంది పాల్గొన్నారు.



గ్రామాల్లో పర్యటిస్తున్న ఏపీజీబీ అధికారులు

కనువిందు చేస్తున్న బాలపల్లె జలపాతం

రైల్వేకోడూరు, డిసెంబరు 17 (ఆంధ్రజ్యోతి): మండలంలోని బాలపల్లె అడవి వద్ద ప్రధాన దారి పక్కనే కొండ మీద నుంచి జలపాతంలా పారుతున్న నీరు వద్ద పర్యాటకులను కనువిందు చేస్తోంది. ఇటీవల పలు దఫాలుగా కురిసిన భారీ వర్షాలకు శేషాచలం, వెలుగొండ అటవీ ప్రాంతాల నుంచి వస్తున్న నీరు బాలపల్లె వద్ద జలపాతంలా రోడ్డుపై పారుతుండటంతో ప్రయాణికులు అక్కడ సరదాగా గడుపుతున్నారు. రైల్వేకోడూరు మీదుగా తిరుపతి, తిరుమల ప్రాంతాలకు వెళ్లే పర్యాటకులను ఈ జలపాతం కనువిందు చేస్తోంది.



ప్రయాణికులకు కనువిందు చేస్తున్న జలపాతం

20న రాజంపేట, మదనపల్లిలో

ఉద్యోగమేళా

రాజంపేట, డిసెంబరు 17 (ఆంధ్రజ్యోతి) : జిల్లాలోని రాజంపేట, మదనపల్లెలోని ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలల్లో ఈనెల 20న ఏపీ స్టేట్ స్కిల్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ (ఏపీఎస్ఎస్‌డీసీ) సీడాప్, జిల్లా ఉపాధి కార్యాలయం సంయుక్తంగా ఉద్యోగమేళా నిర్వహిస్తున్నట్లు జిల్లా నైపుణ్యాభివృద్ధి అధికారి దాసరి నాగార్జున ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఎస్‌బీఐ లైఫ్, ఐసీఐసీఐ బ్యాంకు, ఏయూ స్మాల్ ఫైనాన్స్ బ్యాంకు, ముత్తూట్ ఫైనాన్స్, శ్రీరామ్ లైఫ్ ఇన్సూరెన్స్ తదితర కంపెనీలు పాల్గొంటాయన్నారు. ఆసక్తిగల యువతీ యువకులు ఈ మేళాను సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

పశుసంవర్ధక శాఖ

డీడీ బదిలీ

కలికిరి, డిసెంబరు 17 (ఆంధ్రజ్యోతి): కడప జిల్లా పశుసంతతి అభివృద్ధి సంస్థ (డీఎల్‌డీఏ)లో ఎక్జిక్యూటివ్ అధికారిగా డెప్యుటేషన్‌పై పనిచేస్తున్న డాక్టర్ జి. రమేష్‌ను మాతృ సంస్థకు వెనక్కి పంపిస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. విజయవాడలోని పశుసంవర్థక శాఖ డైరెక్టర్ కార్యాలయంలో డిప్యూటీ డైరెక్టరుగా నియమించింది. ఈ మేరకు రాష్ట్ర పశుసంవర్ధక శాఖ కార్యదర్శి ఎం.ఎం. నాయక్ మంగళవారం ఉత్తర్వులు జారీ చేశారు.

వైభవంగా సీతారాముల కల్యాణం



సీతారాముల కల్యాణం నిర్వహిస్తున్న అర్చకులు

వాల్మీకిపురం, డిసెంబరు 17 (ఆంధ్రజ్యోతి): వాల్మీకిపురం పట్టణంలోని పట్టాభిరామాలయంలో మంగళవారం టీటీడీ ఆధ్వర్యంలో పునర్వసు సీతారాముల కళ్యాణోత్సవ వేడుకలు వైభవంగా నిర్వహించారు. ఉదయం సుప్రభాత సేవ, ఆలయంలో మూలవర్లకు అభిషేకం, అర్చన, తోమాలసేవలతో ప్రత్యేక పూజలు జరిగాయి. అనంతరం భోగోత్సవ మూర్తులైన సీతారాములను నూతన వధూవరులుగా అలంకరణలు చేసి ఆలయ మండపంలో మామిడి తోరణాలు, పుష్పాలంకరణలతో ఏర్పాటు చేసిన కళ్యాణ వేదికపై ఆశీనులు గావించారు. మంగళవాద్యాలు, వేదపండితుల మంత్రోచ్చారణలు, విశేష భక్తజనం నడుమ సీతారాముల కల్యాణం కమనీయంగా సాగింది. చివరగా హోమం, పూర్ణాహుతి చేసి కల్యాణంలో పాల్గొన్న భక్తులకు టీటీడీ వస్త్రం, ప్రసాదాలు అందజేశారు. సాయంత్రం సీతాలక్ష్మణ సమేత పట్టాభిరాములకు తిరుచ్చిలో విశేష అలంకరణలు చేసి పురవీధులలో నగరోత్సవం నిర్వహించారు. కార్యక్రమాలలో ఆలయ అధికారులు కృష్ణమూర్తి, నాగరాజు, అర్చకులు ధనుష్‌భట్టార్, భాషికార్యులు, ఆలయ సిబ్బంది భక్తులు పాల్గొన్నారు.


దాల్మియా సిమెంట్స్ బాధిత రైతుల కోసం

ఉన్నత స్థాయి కమిటీ ఏర్పాటు

కలికిరి, డిసెంబరు 17 (ఆంధ్రజ్యోతి): కడప జిల్లాలో ఏర్పాటు చేసిన దాల్మియా సిమెంటు ఫ్యాక్టరీతో తలెత్తిన కాలుష్యం, ఫ్యాక్టరీకి సంబంధించిన కట్టలు, ప్రహరీ తదితర సమస్యలను అధ్యయనం చేసి పరిష్కరించడం కోసం ఒక ఉన్నత స్థాయి కమిటీని ఏర్పాటు చేస్తూ ప్రభుత్వం మంగళవారం ఉత్తర్వులు జారీ చేసింది. సిమెంటు కర్మాగారం కారణంగా పరిసరాల్లోని నవాబుపేట, దుగ్గనపల్లె గ్రామస్తులు ఎదుర్కొంటున్న సమస్యలను పరిశీలించడానికి ఏడుగురితో కూడిన ఉన్నత స్థాయి కమిటీని ప్రభుత్వం నియమించింది. జిల్లాకు చెందిన ఆర్.మల్లికార్జున చేసిన ఫిర్యాదు మేరకు లోకాయుక్త ఆదేశాలపై గతంలో 2023 మార్చి 2న జలవనరుల శాఖ సూపరింటెండింగ్ ఇంజినీరు ఇచ్చిన నివేదికతో పాటు లోకాయుక్త దర్యాప్తు అధికారి నివేదికలను పరిశీలించి సిమెంటు పరిశ్రమ కారణంగా గ్రామస్తులు ఎదుర్కొంటున్న సమస్యలు ప్రధానంగా కట్ట ఏర్పాటు, ప్రహరీతో పాటు కర్మాగారం వెదజల్లుతున్న కాలుష్యాన్ని పరిశీలించాలని కమిటీకి ప్రభుత్వం సూచించింది. భూములు కోల్పోయే రైతులకు శాశ్వత పునరావాసాల ఏర్పాటు కోసం వారు కోరుతున్న అంశాలను పరిగణలోకి తీసుకుని పరిష్కార మార్గాలు కనుగొనాలని కూడా పేర్కొన్నారు. కడప జిల్లా కలెక్టరు ఆధ్వర్యంలో జమ్మలమడుగు ఆర్డీవో, కడప మైన్స్ అండ్ జియాలజీ డిప్యూటీ డైరెక్టరు, జల వనరుల శాఖ కడప ఎస్ఈ, కడప వ్యవసాయ శాఖ డీడీ, ఏపీ కాలుష్య నియంత్రణ మండలి నుంచి ఒకరు, నెల్లూరు మైన్స్ అండ్ జియాలజీ రీజినల్ కార్యాలయం డీడీలను కమిటీగా ఏర్పాటు చేశారు. ఈ మేరకు రాష్ట్ర పరిశ్రమల శాఖ ముఖ్య కార్యదర్శి నీరబ్ కుమార్ ప్రసాద్ మంగళవారం ఆదేశాలు జారీ చేశారు.

ఆరు నెలలుగా జీతాలు రాక...

- కుదేలవుతున్న జీవితాలు
- కొత్త ప్రభుత్వం వచ్చినా తప్పని కష్టాలు
- ఆవేదనలో ఆయాలు, వాచ్‌మెన్‌లు



ఎర్రగుంట్ల బాలుర ఉన్నత పాఠశాలలో పనిచేస్తున్న చిరు కార్మికులు

ఎర్రగుంట్ల, డిసెంబరు 17 (ఆంధ్రజ్యోతి): పాఠశాలల్లో విద్యార్థులు విసర్జించిన మలమూత్రాలు శుభ్రం చేసే చిరు కార్మికులపై ప్రభుత్వాలు దయ చూపడం లేదు. ఇచ్చేది అరకొర, అదీ ఆరు నెలలకోమారు ఇస్తుండడంతో వారి జీవితాలు కుదేలవుతున్నాయి. ఇచ్చే జీతాలు కొంతమేరకు వడ్డీలకే సరిపోతోందని వాపోతున్నారు. లక్షల జీతాల పొందే శాశ్వత ప్రభుత్వ ఉద్యోగులకు ఒకటవ తేదీనే జీతాలిస్తున్నామని గొప్పలు చెప్పుకునే ప్రభుత్వాలు చాలీచాలనీ జీతాలతో పనిచేసే పాఠశాల, కాలేజీల ఆయాలు, వాచ్‌మెన్‌లకు మాత్రమే ఆరు నెలలవుతున్నా ఇప్పటి వరకు జీతాలు ఇవ్వకపోవడం దారుణం. అసలు ఎప్పుడు జీతాలు వేస్తారో కూడా చెప్పలేని పరిస్థితిలో అధికార యంత్రాంగం ఉంది. జిల్లావ్యాప్తంగా సుమారు 3 వేల మందికి పైగా ఆయాలు పనిచేస్తున్నారు. వీరందరికీ జూన్ వరకు మాత్రమే జీతాలిచ్చారు. గత ప్రభుత్వం హయాంలో పరిస్థితి దారుణంగా ఉండిందని కొత్త ప్రభుత్వం వచ్చిన తర్వాతైనా తమ జీవితాలు బాగుపడతాయనికుంటే ఇప్పుడు ఎలాంటి మార్పు లేదని వారు వాపోతున్నారు. బజారులో అప్పులిచ్చేవారు కరువయ్యారని, అత్యవసర పరిస్థితులకు రూ.5 నుంచి రూ.10 వడ్డీలకు తెచ్చుకోవాల్సి వస్తోందని బాధపడుతున్నారు. కొత్త ప్రభుత్వం వచ్చి ఆరు నెలలు దాటినా కేవలం ఒక నెల జీతం మాత్రమే మంజూరు చేసినట్లు ఆయాలు వివరిస్తున్నారు. భరించరాని వాసన ఉన్న మరుగుదొడ్లు, బాత్‌రూంలు క్లీన్ చేస్తున్నాం, కసువు ఊడ్చి విద్యార్థులు అనారోగ్యాల బారిన పడకుండా పనిచేస్తున్నాము. అయినా ఈ ప్రభుత్వాలకు మాపై దయ కలగడం లేదని ఆవేదన వ్యక్తం చేస్తు న్నారు. కేవలం ఆరు వేలు మాత్రమే ఇస్తున్నారని అదీ ఆరు నెలలుగా రాలేదని వాపోతున్నారు. మేమెలా బతకాలని నిట్టూరుస్తున్నారు. ఈ విషయమై జిల్లా విద్యాశాఖాధికారి మీనాక్షిని వివరణ కోరగా.. జిల్లా వ్యాప్తంగా 3 వేల మంది ఆయాలున్నారు. వీరికి జూలై నుంచి జీతాలు రాలేదు. ఇప్పటి వరకు బడ్జెట్ రాలేదు. వచ్చిన వెంటనే ఇస్తాం.

ఆరు నెలల నుంచి జీతాలు రావాలి

పాఠశాలలో ఎప్పటి నుంచే పనిచేస్తున్నాం. గతంలో రెండు మూడు నెలలకోసారి జీతాలు వచ్చేవి. ఇప్పుడు ఏకంగా ఆరు నెలలుగా జీతాలు రావడం లేదు. కుటుంబ పోషణ భారంగా మారింది. ఇంటి అద్దె కట్టలేకపోతున్నాము. యజమానులు ఖాళీ చేయమంటున్నారు. కిరాణ షాపుల్లో కూడా అప్పులిచ్చేవారు లేకపోవడంతో వడ్డీలకు తెచ్చుకుని జీవిస్తున్నాము. ఇచ్చిన అప్పు కడితే తప్ప మళ్లీ అప్పులివ్వమంటున్నారు. హెచ్ఎంతో కూడా రూ.5 వేలు అప్పు తీసుకున్నాము. ఇప్పటికైనా ప్రభుత్వం మాపై దయతలచి వెంటనే జీతాలు మంజూరు చేయాలి.

-రవి, లక్ష్మి, బాలుర ఉన్నత పాఠశాల ఎర్రగుంట

మధ్యవర్తిత్వంలో న్యాయవాదుల పాత్ర కీలకం

● మొదటి అదనపు జిల్లా జడ్జి వెంకటేశ్వరరావు



న్యాయవాదులకు శిక్షణ ఇస్తున్న మాస్టర్ ట్రైనర్స్

కడప రూరల్, డిసెంబరు 17(ఆంధ్రజ్యోతి): వివాదాల పరిష్కారానికి మధ్యవర్తిత్వంలో న్యాయవాదుల పాత్ర కీలకంగా ఉంటుందని మొదటి అదనపు జిల్లా జడ్జి వెంకటేశ్వరరావు పేర్కొన్నారు. జిల్లా కోర్టు ఆవరణలోని న్యాయసేవాసదన్‌లో మంగళవారం రెండో రోజు 'మధ్యవర్తిత్వంపై న్యాయవాదుల పాత్ర' అంశంపై శిక్షణను కల్పించారు. జడ్జి మాట్లాడుతూ మధ్యవర్తిత్వం ద్వారా సమస్యలను పరిష్కరించుకోవడం వలన ఖర్చు, సమయాన్ని ఆదాచేస్తుందన్నారు. వ్యక్తుల మధ్య తగాదాలను రాజీమార్గం ద్వారా పరిష్కరిస్తారన్నాయన్నారు. అనంతరం కర్ణాటకకు చెందిన రిసోర్స్‌పర్సన్(ట్రైనర్) మిస్ బీనా దేవరాజ్, తమిళనాడుకు చెందిన రిసోర్స్‌పర్సన్(ట్రైనర్) డాక్టర్ ఎస్. పద్మ మధ్యవర్తిత్వం లాయర్ల పాత్ర, రాజీనియమాలు, కమ్యూనికేషన్ నిర్వచనం, పక్రియ, ప్రయోజనాలు, రోల్ ప్లే, స్కిల్స్, బాడీలాంగ్వేజ్, చర్చల నైపుణ్యాలు, అడ్డంకులపై పవర్ ప్రెజెంటేషన్ ద్వారా శిక్షణ ఇచ్చారు. న్యాయవాదులు పాల్గొన్నారు.

ప్రొద్దుటూరులో సేల్స్ ట్యాక్స్ అధికారుల తనిఖీ



బంగారు దుకాణంలో తనిఖీ చేస్తున్న సేల్స్ ట్యాక్స్ అధికారులు

ప్రొద్దుటూరు అర్బన్ డిసెంబరు 17 (ఆంధ్రజ్యోతి): బంగారు, వస్త్ర వ్యాపారాలకు ప్రఖ్యాతి గాంచిన ప్రొద్దుటూరులో మంగళవారం సేల్స్ ట్యాక్స్ అధికారులు ఆకస్మిక తనిఖీ చేపట్టారు. ప్రొద్దుటూరుకు వివిధ ప్రాంతాల నుంచి వచ్చే ప్రజలు బంగారు, వస్త్ర దుకాణాల్లో వ్యాపారాలు చేస్తుంటారు. పట్టణంలోని మెయిన్ బజార్‌లో ఉన్న ఉరుటూరు గోపాల క్రిష్టయ్య జ్యువెలర్స్‌లో సేల్స్ టాక్స్ అధికారులు తనిఖీ నిర్వహించారు. మధ్యాహ్నం 2 గంటల ప్రాంతం నుంచి సాయంత్రం 6.30 వరకు అధికారుల దాడులు కొనసాగాయి. రెండో అధికారుల బృందం మైదుకూరురోడ్డు లోని వస్త్రభారతి, న్యూ వస్త్రభారతి సముదాయాల్లో కూడా తనిఖీ చేపట్టారు. మదనపల్లికి చెందిన సేల్స్ టాక్స్ అధికారులు, సాన్థిక అధికారులతో కలిసి ఈ దాడులు సాగించారు. కాగా బంగారు దుకాణం వద్ద దాడుల అనంతరం విలేఖరులు పలు ప్రశ్నలు అడగగా సమాధా నం దాటవేయడంతో ఇవి కేవలం సాధారణ తనిఖీలని, ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు ఈ తనిఖీ నిర్వహించామన్నారు.

రోబోటిక్ టెక్నాలజీతో మోకీలు శస్త్రచికిత్స

కడపలో నూతన పద్ధతితో మోకీలు మార్పిడి

విజయవంతమైన శస్త్ర చికిత్స



శస్త్రచికిత్స అనంతరం మహిళతో డాక్టర్ విద్యాసాగర్

కడప సెవెన్‌రోడ్స్, డిసెంబరు 17 (ఆంధ్రజ్యోతి): రోబోటిక్ టెక్నాలజీతో దెబ్బతిన్న భాగాన్ని మాత్రమే మారుస్తూ సూక్ష్మ పద్ధతిలో వంద శాతం ఖచ్చితత్వంతో సహజ సిద్ధమైన లిగ్మెంట్స్‌ని పరిరక్షిస్తూ శస్త్రచికిత్స నిర్వహించామని డాక్టర్ సి.విద్యాసాగర్ వివరించారు. కడప నగరంలోని విద్యాసాగర్ హాస్పిటల్‌లో 55ఏళ్ల మహిళకు రోబోటిక్ టెక్నాలజీతో పాక్షిక మోకీలు మార్పిడి శస్త్ర చికిత్సను విజయవంతంగా నిర్వహించామని వివరించారు. ఆయన మాట్లాడుతూ సాధారణంగా మోకీలులో మూడు కంపార్ట్ మెంట్స్ (భాగాలు)గా ఉంటాయి. వాటిలో ఏ భాగం దెబ్బతిన్నా లేదా అరిగినా మోకీలు నొప్పి వస్తుంది. మూడు భాగాల్లో ఒక భాగం దెబ్బతిన్నప్పుడు (యూనీ కంపార్ట్ మెంటల్ ఆస్ట్రియో ఆర్థరైటిస్) పూర్తిగా మోకీలు మార్పిడి చేయకుండా పాక్షికంగా అరిగిన మోకీలు భాగాన్ని మాత్రమే మార్పిడి చేయవచ్చు. ఈ శస్త్ర చికిత్సను పూర్తి స్థాయిలో వంద శాతం సత్ఫలితాలు తీసుకురావడానికి అత్యాధునిక టెక్నాలజీకి తోడు సర్జన్ ప్రతిభ తోడవ్వాలి. అత్యాధునిక రోబోటిక్ టెక్నాలజీ ద్వారా దెబ్బతినని మోకీలు భాగాన్ని యథాతథంగా ఉంచుతూ దెబ్బతిన్న భాగాన్ని మాత్రమే మారుస్తూ, సూక్ష్మ పద్ధతిలో తక్కువ కోతతో వంద శాతం ఖచ్చితత్వంతో సహజ సిద్ధమైన లిగ్మెంట్స్‌ని పరిరక్షించామని వివరించారు. ఈ విధానం ద్వారా తక్కువ నొప్పి, తక్కువ కోత, సహజమైన దెబ్బతినని మోకీలును పరిరక్షించడం, త్వరితగతిన రికవరీ, సునాయాసమైన మోకీలు కదలికలు, సహజమైన మోకీలు అనే భావన లాంటి సత్ఫలితాలు పొందవచ్చని వివరించారు. అత్యాధునిక రోబోటిక్ టెక్నాలజీని ఉపయోగించి అభివృద్ధి చెందిన దేశాల్లో, నగరాల్లో పాక్షిక మోకీలు మార్పిడి శస్త్ర చికిత్స విజయవంతంగా నిర్వహిస్తున్నారు. ఇప్పుడు మన కడప నగరంలో విద్యాసాగర్ హాస్పిటల్‌లో డాక్టర్ సి.విద్యాసాగర్ మొట్టమొదటిసారిగా రోబోటిక్ టెక్నాలజీతో మోకీలు మార్పిడి చేశారు.

విపత్తులు వస్తే సిద్ధంగా ఉండాలి

జిల్లా విద్యుత్ శాఖ అధికారి రమణ



శిక్షణలో మాట్లాడుతున్న రమణ

కడప నాగరాజుపేట, డిసెంబరు 17(ఆంధ్రజ్యోతి): విపత్తులు సంభవించినపుడు వాటిని ఎదుర్కొనేందుకు సంసిద్ధంగా ఉండాలని జిల్లా విద్యుత్ శాఖ అధికారి ఎస్.రమణ సిబ్బందికి సూచించారు. భారత ప్రభుత్వ అధికార మంత్రిత్వ శాఖ ఆధ్వర్యంలో నేషనల్ పవర్ ట్రైనింగ్ ఇన్‌స్టిట్యూట్ వారు నిర్వహిస్తున్న కార్యాచరణ భద్రత, విపత్తు నిర్వహణ శిక్షణ రెండో రోజు కడపలో నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ శిక్షణ ఇస్తున్న దుర్గాప్రసాద్ 2003లో ఉమ్మడి కడప జిల్లా ఎస్ఈగా విధులు నిర్వహించి చీఫ్ ఇంజనీరుగా ఉద్యోగ విరమణ చెందిన వ్యక్తి ద్వారా శిక్షణ తీసుకోవడం అదృష్టంగా భావించాలని తెలిపారు. విద్యుత్ భద్రత విధానాలు, ప్రమాద నివారణ పద్దతులపై, అగ్ని ప్రమాదాలపై లోతైన అవగాహన ఉంటుందని, ప్రమాదం జరిగిన తర్వాత ఎలా నిర్వహించాలో తెలుసుకోవచ్చన్నారు. ఎన్‌పీటీఐ డైరెక్టర్ ముత్తుకుమార్, డీఈఈ కృష్ణదేవ, సిబ్బంది పాల్గొన్నారు.

మున్సిపల్ అదనపు వర్కర్ల అర్ధనగ్న ప్రదర్శన



అర్ధనగ్నంగా నిరసనలు తెలుపుతున్న మున్సిపల్ కార్మికులు

కడప(వినాయకనగర్), డిసెంబరు17(ఆంధ్రజ్యోతి): మున్సిపల్ కోవిడ్ కార్మికులు, అదనపు కార్మికుల పెండింగ్ వేతనాలు వెంటనే జమ చేయాలని అర్ధనగ్న ప్రదర్శన నిర్వహించారు. మంగళవారం కార్పొరేషన్ కార్యాలయం ఎదుట డ్రైవర్ల కమిటీ కార్యదర్శి సుంకర కిరణ్ అధ్యక్షతన కార్మికుల అనుబంధ సంస్థ సీఐటీయూ నగర ప్రధాన కార్యదర్శి వెంకటసుబ్బయ్య మాట్లాడుతూ వేతన జీవులకు మూడు నెలలుగా జీతాలు వేయడం లేదన్నారు. అధికారులు పట్టించుకోక పోవడంతో ఆందోళన నిర్వహిస్తున్నామన్నారు. పండుగల సమయంలో కార్మికులను పస్తులు పెట్టవద్దన్నారు. న్యాయం జరగకపోతే కడప నగరాన్ని దిగ్బంధం చేస్తామన్నారు. కార్మికులకు ఈఎస్ఐ, పీఎఫ్ కల్పించమని ఎన్నిసార్లు చెప్పినా పట్టించుకోవడం లేదన్నారు. సీఐటీయూ నగర అధ్యక్షుడు చంద్రారెడ్డి, యూనియన్ నేతలు, కార్మికులు పాల్గొన్నారు.

కాల్వ స్థలం ఆక్రమణ యత్నం

బెడ్ కడ్డీలు తొలగించిన టౌన్ ప్లానింగ్ సిబ్బంది



వేసిన కడ్డీలను తొలగిస్తున్న సిబ్బంది

ప్రొద్దుటూరు , డిసెంబరు 17 (ఆంధ్రజ్యోతి) : పట్టణ పరిధిలోని శ్రీరాముల పేట వీధిలోని మున్సిపల్ కాల్వ పోరంబోకు స్థలం ఆక్రమణకు శిల్పకల ఫంక్షన్ హాలు యజమానులు యత్నించారు. మంగళవారం తమ ఫంక్షన్ హాలు వెనుక వున్న మున్సిపల్ కాల్వ పరంబోకు స్థలా న్ని చదును చేసి బెడ్ కాంక్రీట్ వేయడానికి కడ్డీలు కట్టారు. అక్కడ ఫంక్షన్ హాలు కోసం వంట షెడ్ నిర్మాణం చేపట్టడానికి ఈ నిర్మాణ పనులు చేపట్టినట్లు టౌన్ ప్లానింగ్ అధికారులు గుర్తించారు. కమిషనర్ మల్లికార్జున ఆదేశాల మేరకు టౌన్ ప్లానింగ్ వార్డు ప్లానింగ్ సెక్రటరీ మహేష్ సిబ్బందితో వెళ్లి మున్సిపల్ కాల్వ పో రంబోకు స్థలం ఆక్రమణ యత్నాలను అడ్డుకు న్నారు. చదునుచేసి బెడ్ కాంక్రీట్‌కు సిద్దంగా వుంచిన కడ్డీలను వాటిని కటింగ్‌చేసే యంత్రాలను సీజ్ చేశారు. ఇప్పటికే శిల్పకల ఫంక్షన్ హాలు నిర్మాణం మున్సిపల్ టౌన్‌ప్లానింగ్ నిబంధనలకు విరుద్దంగా అక్రమంగా నిర్మించారు. ఈ అక్రమ కట్టడంపై గతంలో పని చేసిన టౌన్‌ప్లానింగ్ ఏసీపీ ఎటువంటి చర్యలు తీసుకోకుండా భారీగా ముడుపులు తీసుకోని వాటిని అనుమతించారు. ఇప్పటికి ఈ కట్టడంపై చార్జ్ షీటు కూడా వేయనట్లు సమాచారం. ఈ అక్రమ కట్టడానికి మున్సిపల్ రెవెన్యూ అధికారులు పన్ను సైతం విధించారు. ఇప్పటికైనా ఈ అక్రమ కట్టడంపై చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు.

నిందితుడికి రిమాండ్

ముద్దనూరు డిసెంబరు17(ఆంధ్రజ్యోతి): వెల్పుచర్లలో జరిగిన ఘర్షణ కేసులో నిందితుడు రాచకుంట బాలకృష్ణను అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించినట్లు ఎస్ఐ మైనుద్దీన్ తెలిపారు. ఆర్టీసీ బస్టాండు వద్ద ఉండగా అరెస్టు చేసి రిమాండ్‌కు పంపినట్లు ఎస్ఐ తెలిపారు.

ఎంపీడీఓ కార్యాలయం తనిఖీ

వల్లూరు, డిసెంబరు 17 (ఆంధ్రజ్యోతి): మండల పరిషత్ కార్యాలయాన్ని జడ్పీ సీఈఓ ఓబులమ్మ తనిఖీ చేశారు. ఎంపీడీఓ రఘురాంతో చర్చించారు. హాజరు, వివిధ రిజిస్టర్లను పరిశీలించారు. అనంతరం వెలుగు, ఉపాధి సిబ్బందితో సమావేశమై అవగాహన, సూచనలు చేశారు.

బొలెరో దొంగ అరెస్టు

వేంపల్లె, డిసెంబరు 17 (ఆంధ్రజ్యోతి): పోలీస్‌స్టేషన్ వద్ద ఉంచిన బొలెరో వాహనాన్ని దొంగలించిన షేక్ రఫీ అహ్మద్‌ను అరెస్టు చేసినట్లు ఎస్ఐ తిరుపాల్‌నాయక్ తెలిపారు. బైపాస్‌రోడ్డులో ఉండగా పట్టుకుని, వాహనం స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు.

కాంగ్రెస్‌లో గ్రూపు విబేధాలు

పోటా పోటీగా వైఎస్ షర్మిల జన్మదినం కార్యక్రమాలు

కడప కలెక్టరేట్, డిసెంబరు 17(ఆంధ్రజ్యోతి): పీసీసీ అధ్యక్షురాలు వైఎస్ షర్మిల పుట్టిన రోజు సందర్భంగా జిల్లా కాంగ్రెస్ పార్టీలో గ్రూపు రాజకీయాలు బయిటపడ్డాయి. పీసీసీ అధ్యక్షురాలు వైఎస్ షర్మిల జన్మదినం సందర్భంగా జిల్లా కేంద్రంలో పెద్ద ఎత్తున దాదాపు 12 డివిజన్ల నేతలు వేర్వేరుగా సేవా కార్యక్రమాలు చేపట్టారు. నగర అధ్యక్షుడు అప్జల్ ఖాన్ పలు కార్యక్రమాలు చేపట్టారు. కడప నియోజక వర్గం సమన్వయ కమిటీ ఇన్‌చార్జి బండి జకరయ్య ఆధ్వర్యంలో నగరంలోని 5వ డివిజన్‌లో ఏర్పాటు చేసిన కార్యక్రమానికి డీసీసీ అధ్యక్షురాలు విజయజ్యోతి హాజరయ్యారు. అనంతరం జిల్లా కాంగ్రెస్ కార్యాలయంలో జరిగే కార్యక్రమంలో ఇద్దరి మధ్య విభేదాలు తలెత్తాయి. జిల్లా కేంద్రం, కడప నియోజక పరిధిలో జరిగే కార్యక్రమాలను తనకు తెలియకుండా చేస్తున్నారని, ఎంత వరకు కరెక్ట్ అంటూ డీసీసీ అధ్యక్షురాలి విజయజ్యోతి వాగ్వాదానికి దిగారు. తాను మూడు తరాలుగా వైఎస్ కుటుంబంతో ఉన్నానని, కడపలో జరిగే కార్యక్రమాలను తనకు తెలియకుండా నిర్వహిస్తున్నారంటూ నగర అధ్యక్షుడు అప్జల్‌ఖాన్ వాదోపవాదాలకు దిగాడు. ఈవిషయంపై తనను అడగవద్దంటూ, చిన్న, చిన్న విషయాలను పెద్దగా చేయవద్దని విజయజ్యోతి కోపంతో కేక్ కట్ చేయకుండానే కార్యాలయం నుంచి బయిటకు వెళ్లిపోయారు. అనంతరం అప్జల్ ఖాన్ బండి జకరయ్య ఆధ్వర్యంలో కేక్ కట్ చేసి కార్యకర్తలు, నేతలకు పంచి పెట్టారు. కార్యక్రమంలో పీసీసీ ప్రధాన కార్యదర్శి అలీఖాన్, కాంగ్రెస్ నేతలు పీస్ గౌస్ పీర్, శ్యామలమ్మ, విజయసుశీల్, మామిళ్ల బాబు, ప్రసాద్‌గౌడ్, కుల్లయ్య, మార్తమ్మ, సిరాజుద్దీన్ తదితర నేతలు పాల్గొన్నారు.

బోదకొట్టం దగ్ధం



కాలిపోయిన కొట్టం

ముద్దనూరు డిసెంబరు17 (ఆంధ్రజ్యోతి): మండల పరిధి కొలవలి వద్ద నివాసం ఏర్పరచుకున్న యానాది కులస్తుడు దానం పెద్దలయ్య బోద కొట్టం ప్రమాదవశాత్తు కాలి బూడిదైంది. బాధితుడి సమాచారం మేరకు వివరాల్లోకెళితే... కొలవలి వద్ద కొన్నేళ్లగా యానాదులం బోధ కొట్టాలు వేసుకుని నివసిస్తున్నారు. ఇంట్లో నివారు పనులకు వెళ్లిన సమయంలో ప్రమాదవశాత్తు నిప్పు అంటుకుంది. దీంతో కొట్టంలో నున్న టీవీఎస్ వాహనం, సామగ్రి పూర్తిగా కాలిపోయింది. తమను అధికారులు ఆదుకోవాలని పెద్దలయ్య ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

ప్రణవ పీఠాధిపతి ఆధ్యాత్మిక ప్రవచనాలు



ప్రవచనాలు చెబుతున్న వద్దిపర్తి పద్మాకర్

కడప కలెక్టరేట్ డిసెంబరు 17(ఆంధ్రజ్యోతి): త్రిభాషా సహస్రావధాని, ప్రణవ పీఠాధిపతి బ్రహ్మర్షి వద్దిపర్తి పద్మాకర్ ఆధ్యాత్మిక ప్రవచనాలు చేశారు. మంగళవారం నగరంలోని అష్టలక్ష్మీ కల్యాణ మండపంలో సుమతీ అన్నపూర్ణేశ్వరీ సేవాసమితి ఆధ్వర్యంలో దేశభక్తి, ధర్మప్రచార విశిష్టతపై ఆధ్యాత్మిక ప్రవచనాలు వల్లించారు. ఈకార్యక్రమానికి పెద్ద ఎత్తున భక్తులు పాల్గొని 'బలం విష్ణుఃప్రవర్ధతాం, బలం గురోః ప్రవర్ధతాం' నినాదాలతో సభాస్థలి దైవ నామస్మరణంతో మార్మోగింది. సేవా సమితి అధ్యక్షుడు పరమేశ్వరరెడ్డి, గౌరవాధ్యక్షుడు రామ మూర్తి, ఉపాధ్యక్షురాలు లక్ష్మీదేవి, ప్రధాన కార్యదర్శి సుబ్రమణ్యం, కోశాధికారి గిరిధర్ రెడ్డి కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

వైవీయూలో ఐఎస్ఓ ప్రతినిధుల బృందం పరిశీలన

నేడు మరికొన్ని విభాగాలు పరిశీలించే అవకాశం



ఫైల్స్‌ను పరిశీలిస్తున్న ఐఎస్ఓ ప్రతినిధులు - రైఫిల్ షూటింగ్‌కు సంబంధించి పరిశీలిస్తున్న ప్రతినిధి

కడప ఎడ్యుకేషన్, డిసెంబరు 17 (ఆంధ్రజ్యోతి): యోగివేమన విశ్వవిద్యాలయాన్ని ఇంటర్నేషనల్ స్టాండర్డ్ ఆర్గనైజేషన్ (ఐఎస్ఓ) ప్రతినిధుల బృందం సందర్శించింది. తొలుత ప్రతినిధుల బృందం హెచ్‌వైఎం ఇంటర్నేషనల్ సీఈఓ ఆలపాటి శివయ్య, ఆడిటర్ సుమాదేవి విశ్వవిద్యాలయ ఉపకులపతి ఆచార్య కె.కృష్ణారెడ్డిని కలిశారు. అనంతరం కులసచివులు ఆచార్య పి.పద్మ, ప్రధానాచార్యులు ప్రొఫెసర్ ఎస్.రఘునాథరెడ్డి, ఐక్యూఏసీ సంచాలకులు డాక్టర్.ఎల్.సుబ్రమణ్యాశర్మ, డీడీ ఎం.సుబోస్‌చంద్ర, గ్రీన్ అండ్ ఎనర్జీ సభ్యులతో సమావేశమయ్యారు. విశ్వవిద్యాలయంలోని హ్యూమానిటీస్ బ్లాక్, సైన్స్ బ్లాక్, గురుకులం భవనాల్లోని డిపార్ట్‌మెంట్లను పరిశీలించారు. శాఖల్లో జరుగుతున్న ప్రగతిని ప్రత్యక్షంగా గమనించారు. నాణ్యమైన బోధన, ప్రయోగాలు, అధునాతన ప్రయోగశాలలు, పరిశోధనలు, అత్యున్నత ప్రమాణాలు కలిగిన పరిశోధన పత్రాలను వారు చూశారు. అధ్యాపకులు పొందిన పేటెంట్లు, ప్రభుత్వం నుంచి ప్రతిష్టాత్మక సంస్థల నుంచి అందుకున్న అవార్డులు, వివిధ శాఖల్లో అమలు చేస్తున్న నూతన విధానాలను పరిశీలించారు. పరీక్షల నిర్వహణ, విద్యార్థుల ప్రయోజనార్థం పనిచేస్తున్న పలు విభాగాలు వాటి పనితీరును మదింపుచేశారు. విద్యార్థుల మౌలిక వసతులు, పచ్చదనంతో ఉన్న విద్యాలయ పరిసరాలను ప్రత్యక్షంగా చూశారు. బుధవారం కూడా పరిశీలన ఉంటుందని డాక్టర్ సుబ్రమణ్యశర్మ తెలిపారు. ఉపకులపతి ఆచార్య కృష్ణారెడ్డి మాట్లాడుతూ హెచ్‌వైఎం ఇంటర్నేషనల్ సర్టిఫికేషన్ ప్రతిష్టాత్మక అత్యున్నత స్థాయి లభిస్తుందని ఆశాభావం వ్యక్తం చేశారు.

మొక్కల పెంపకం ఎంతో మహోన్నతం

వీసీ ప్రొఫెసర్ విశ్వనాథ్‌కుమార్

కడప ఎడ్యుకేషన్, డిసెంబరు 17 (ఆంధ్రజ్యోతి): జన్మనిచ్చిన నేలతల్లిని స్మరించుకుంటూ చేపట్టిన మొక్కలు నాటే కార్యక్రమం ఎంతో మహోన్నతమైందని డాక్టర్ వైఎస్సార్ ఆర్కిటెక్చర్ అండ్ ఫైన్‌ఆర్ట్స్ యూనివర్సిటీ వైస్ చాన్సలర్ ఆచార్య విశ్వనాథ్‌కుమార్ అన్నారు. మంగళవారం వర్సిటీలో ఆర్తి విజయ ఫౌండేషన్ ట్రస్ట్ ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో ఆయన సేవా పథక కార్యక్రమ అధికారులు, విద్యార్థులతో మొక్కలు నాటే కార్యక్రమాన్ని చేపట్టారు. కార్యక్రమంలో రిజిస్ట్రార్ రాజేష్‌కుమార్‌రెడ్డి, సేవా పథక అధికారులు డాక్టర్ ప్రసాద్‌రెడ్డి, డాక్టర్ వరలక్ష్మి, వర్సిటీ ప్రజాసంబంధాల అధికారి వి.శివకృష్ణారెడ్డి, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

మంత్రి పర్యటన ఏర్పాట్లు పరిశీలన

పెండ్లిమర్రి, డిసెంబరు 17 (ఆంధ్రజ్యోతి): వెల్లటూరులో కేంద్ర గ్రామీణశాఖాభివృద్ధి మంత్రి పర్యటనపై ఏర్పాట్లను అధికారులు పరిశీలించారు. జిల్లా వ్యవసాయాధికారి నాగేశ్వరరావు, జిల్లా గ్రామీణాభివృద్ధి సంస్థ ప్రాజెక్టు డైరెక్టర్ ఆనంద నాయక్ డ్వాక్రా ఉత్పత్తుల ప్రదర్శన, పంటల సాగు గురించి డ్వాక్రా మహిళలు, రైతులతో చర్చించి వడ్డెమాని శివారెడ్డి సాగుచేసిన చామంతి, మినుము, సాంబశివారెడ్డి, శ్రీనివాసులురెడ్డి సాగుచేసిన వేరుశనగ, మామిడి డ్రిప్‌ను పరిశీలించారు.

నాగాభరణం చోరీ

కొండాపురం, డిసెంబరు 17 (ఆంధ్రజ్యోతి): మల్లేశ్వరకోనలో నాగాభరణం చోరీకి గురైంది. శివయ్యకు ధరించే నాగాభరణాన్ని సోమవారం మధ్యాహ్నం అపహరణకు గురైనట్లు నిర్వాహకులు తెలిపారు. వెండితో తయారు చేసిన నాగాభరణం విలువ సుమారు రూ. 2 లక్షల వరకు ఉంటుంది. పోలీసులకు ఫిర్యాదు చేయనున్నట్లు వారు తెలిపారు..

నేటి నుంచి డిపార్ట్‌మెంట్ పరీక్షలు

డీఆర్వో విశ్వేశ్వర నాయుడు

కడప కలెక్టరేట్ డిసెంబరు 17(ఆంధ్రజ్యోతి): జిల్లాలో 18 వతేదీ నుంచి 23 వరకు నిర్వహించనున్న ఏపీపీఎస్సీ డిపార్ట్‌మెంట్ పరీక్షలను కట్టుదిట్టంగా నిర్వహించాలని జిల్లా రెవెన్యూ అధికారి విశ్వేశ్వర నాయుడు ఆదేశించారు. డీఆర్వో చాంబరులో ఏపీపీఎస్సీ డిపార్ట్‌మెంట్ పరీక్షల నిర్వహణపై డీఆర్వో సమీక్షించారు. జిల్లాలో 5 పరీక్షా కేంద్రాల్లో పరీక్షలు నిర్వహిస్తారన్నారు. ఆబ్జెక్టివ్ టైప్‌లో ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం 12 వరకు, కన్వెన్షనల్ టైప్‌లో మధ్యాహ్నం 3 నుంచి 6 గంటల వరకు రెండు విడతలుగా పరీక్షలు జరుగుతాయన్నారు. అభ్యర్థులు హాల్ టిక్కెట్లతో ఉదయం 8-30 గంటల నుంచి 9-30 వరకు, మధ్యాహ్నం 1-30 గంటల నుంచి 2-15 గంటల వరకు మాత్రమే కేంద్రంలోకి అనుమతిస్తారన్నారు. లైజన్ ఆఫీసర్లు, చీఫ్ సూపరింటెండెంట్లు పోలీసు యంత్రాంగం సమన్వయంతో పనిచేయాలన్నారు. కడప ఉక్కాయపల్లెలోని శ్రీశ్రీనివాస్ ఇన్స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ అండ్ సైన్సెస్, చింతకొమ్మదిన్నె మండల పరిధిలో కేఓఆర్‌ఎం మెమోరియల్ కాలేజీ, ఆఫ్ ఇంజనీరింగ్, కేఎస్ఆర్ఎం కళాశాల, కేఎల్‌ఎం కాలేజీ ఆఫ్ ఇంజనీరింగ్ కళాశాల లు (తాడిగొట్ల), ప్రొద్దుటూరు పరిధిలో- సాయి రాజేశ్వరీలో పరీక్షలు జరుగుతాయన్నారు.

వైవీయూ పూర్వ పరిశోధక విద్యార్థి డాక్టర్ ధీరజ్‌కు ప్రశంసలు



ప్రశంసాపత్రాన్ని స్వీకరిస్తున్న ధీరజ్

కడప ఎడ్యుకేషన్, డిసెంబరు 17 (ఆంధ్రజ్యోతి): యోగి వేమన విశ్వవిద్యాలయం పూర్వ పరిశోధక విద్యార్థి డాక్టర్.బి.వి.కె.ధీరజ్ అంతర్జాతీయ సదస్సులో ప్రశంసలు అందుకున్నారు. 13 నుంచి 15 వరకు న్యూఢిల్లీలోని నేషనల్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ హెల్త్ అండ్ ఫ్యామిలీ వెల్ఫేర్‌లో నిర్వహించిన అంతర్జాతీయ సదస్సులో ఆంధ్రప్రదేశ్‌లోని వృద్ధులలో అభిజ్ఞా పనితీరుపై సామాజిక-జనాభా చరరాశుల పాత్ర అనే అంశంపై పరిశోధన పత్రాన్నిసమర్పించారు. ధీరజ్ పరిశోధన పత్రాన్ని సోషియో సైకలాజికల్ రంగంలో ఉత్తమమైనదిగా ఎంపిక చేసి శ్రీవేంకటేశ్వర అవార్డును అసోసియేషన్ ఆఫ్ జెరోంటాల జీ ఇండియా అందజేసింది. అతనికి వైవీయూ సైకాలజీ శాఖ డాక్టర్ కె.లలిత మార్గదర్శకత్వం అందించారు.

అనుమానాస్పద స్థితిలో వ్యక్తి మృతి



సురేష్ మృతదేహం

కొండాపురం, డిసెంబరు 17 (ఆంధ్రజ్యోతి): లావనూరు-చెన్నమనేనిపల్లె మధ్య మంగళవారం సురేష్(35) అనుమానాస్పద స్థితిలో మృతిచెందాడు. వంక దగ్గర మృతదేహం పడి ఉండటాన్ని స్థానికులు గుర్తించి పోలీసులకు సమాచారం అందించారు. మృతుడు అనంతపురం జిల్లా యల్లనూరు వాసి బాలయ్య కుమారుడిగా పోలీసులు గుర్తించారు. వంక దగ్గర మృతదేహం పడి ఉండడంతో పలు అనుమానాలకు తావిస్తోంది. వివిధ కోణాల్లో పోలీసులు విచారిస్తున్నారు. కొండాపురం పోలీసులు యల్లనూరు చేరుకుని స్థానిక పోలీసులతో కలిసి విచారిస్తున్నారు. అనుమానాస్పద స్థితిలో మృతి చెందినట్లు కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ విద్యాసాగర్ తెలిపారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం తాడిపత్రి ప్రభుత్వాస్పత్రికి తరలించారు.

నేడు రెవెన్యూ సదస్సు

బి.కొత్తకోట, డిసెంబరు 17(ఆంధ్రజ్యోతి): బయప్పగారిపల్లెలో బుధవారం రెవెన్యూ సదస్సు నిర్వహించనున్నట్లు తహసీల్దార్ మహమ్మద్ అన్సారీ పేర్కొన్నారు. రెవెన్యూ పర సమస్యలపై అర్జీలు స్వీకరించి, వాటిని ఆన్‌లైన్ చేసి, తగిన చర్యలు తీసుకుంటామన్నారు. పంచాయతీ పరిధిలోని రైతులందరూ ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు.

రాహుకాల దీపకాంతుల్లో విజయదుర్గాదేవి ఆలయం



రాహుకాల పూజలు నిర్వహిస్తున్న భక్తులు(ఇన్‌సెట్) విజయదుర్గ అమ్మవారు

కడప కల్చరల్, డిసెంబరు 17 (ఆంధ్రజ్యోతి): అమ్మలగన్న అమ్మ కడప విజయదర్గమ్మ ఆలయం రాహుకాల దీపకాంతులతో దేదీప్యమానంగా ప్రకాశించింది. మంగళవారం కావడంతో జిల్లానుంచే కాకుండా రాయలసీమలోని పలు ప్రాంతాల నుంచి భక్తులు పెద్ద ఎత్తున హాజరై అమ్మవారి సన్నిధిలో దీపాలను వెలిగించి ఆ తల్లి సేవలో తరించారు. అనంతపురం జిల్లా నుంచి ఆలయానికి వచ్చిన కృష్ణవేణి, లతమ్మ, సుబ్బమ్మ మాట్లాడుతూ దుర్గమ్మ కోరిన కోర్కెలు తీరుస్తుందన్నారు. మా ఊరి నుంచి రావడానికి దూరమైనా పూజకు క్రమం తప్పకుండా హాజరవుతున్నామన్నారు.

చెన్నకేశవ స్వామి ఉత్సవాలకు ఆహ్వానం

వల్లూరు, డిసెంబరు 17 (ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని పైడికాల్వ గ్రామంలో త్వరలో జరగనున్న రాజ్యలక్ష్మీసమేత చెన్నకేశవ స్వామి బ్రహ్మోత్సవాలకు ప్రముఖ ఆధ్యాత్మిక ప్రవచన కారుడు పద్మాకర్‌రావుకు ఆలయ ప్రధాన అర్చకుడు ఇంద్రగంటి హరినారాయణ శర్మ ఆహ్వానం అందజేశారు. మంగళవారం స్థానిక అష్టలక్ష్మి కళ్యాణ మండపంలో ప్రవచన కార్యక్రమానికి హాజరైన పద్మాకర్‌రావును కలిసి విన్నవించారు. స్పందించిన పద్మాకర్‌రావు తప్పక హాజరవుతానని, రాలేని పక్షంలో మరోసారి ఖచ్చితంగా ఆలయాన్ని సందర్శించి భక్తులకు ప్రవచనాన్ని అందిస్తానన్నారు.

వక్ఫ్‌బోర్డు రాష్ట్ర కమిటీ సభ్యుడిగా దావుద్‌బాషా

కడప(వినాయకనగర్), డిసెంబరు17(ఆంధ్రజ్యోతి): వక్ఫ్‌బోర్డు రాష్ట్ర నూతన కార్యవర్గాన్ని మంగళవారం విజయవాడలో ఎన్నుకున్నారు. రాష్ట్ర కమిటీ సభ్యుడిగా కడప నగరానికి చెందిన సయ్యద్ దావుద్‌బాషా ఎన్నికయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ముస్లిం మైనార్టీల సంక్షేమానికి కృషి చేస్తామన్నారు. వక్ఫ్‌బోర్డు ఆస్తులను కాపాడడానికి కృషి చేస్తామన్నారు.

9వ రోజుకు చేరిన న్యాయవాదుల దీక్షలు

కడప రూరల్, డిసెంబరు 17 (ఆంధ్రజ్యోతి) :గంజాయి, డ్రగ్స్ కేసుల విచారణను కడపలోనే చేపట్టాలని డిమాండ్ చేస్తూ కడప బార్ అసోసియేషన్ ఆధ్వర్యంలో జిల్లా కోర్టు ఎదుట చేపట్టిన న్యాయవాదుల దీక్షలు మంగళవారానికి 9వ రోజుకు చేరుకున్నాయి. ఈ సందర్భంగా బార్ అసోసియేషన్ అధ్యక్షుడు బొగ్గుల గుర్రప్పనాయుడు మాట్లాడుతూ తిరుపతిలో ఫాస్ట్‌ట్రాక్ కోర్టు ఏర్పాటుకు తీసుకొచ్చిన జీఓ నెంబర్ 145ను రాష్ట్ర ప్రభుత్వం వెంటనే ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేశారు. కడపలో చేపడుతున్న గంజాయి, డ్రగ్స్ కేసుల విచారణను తిరుపతిలోని ప్రత్యేక ఫాస్ట్‌ట్రాక్ కోర్టుకు తరలించడం దారుణమన్నారు. ఈ చర్యల వల్ల కక్షిదారులు ఎంతో వ్యయప్రయాసాలు పడాల్సి వస్తుందన్నారు. గంజాయి, డ్రగ్స్ కేసులను కడపలోనే విచారణ జరపాలన్నారు. పలువురు న్యాయవాదులు 9 రోజు దీక్షలను చేపట్టారు. ఈ కార్యక్రమంలో కడప బార్ అసోసియేషన్ నాయకులు, సీనియర్, జూనియర్ న్యాయవాదులు పాల్గొన్నారు.

చిత్రం చెప్పిన సమస్య



కడప-రాయచోటి జాతీయ రహదారిపై ఊటుకూరు సర్కిల్‌లో చుట్టూ వచ్చేవాహనాలు కనిపించే విధంగా ప్రమాదాలు జరగకుండా ఉండాలని ఏర్పాటు చేసిన లైట్లు వెలగడం లేదు. దీంతో వాహనదారులు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారు. నాలుగు వైపుల నుంచి ఏ వాహనం ఎటు వస్తుందో కనిపించడం లేదని వాహనదారులు అంటున్నారు. 12 లైట్లు ఉండగా వాటిలో రెండు మాత్రమే వెలుగుతున్నాయి. అధికారులు స్పందించి లైట్లు రిపేరు చేయాలని కోరుతున్నారు.

-చింతకొమ్మదిన్నె, (ఆంధ్రజ్యోతి)

'వైసీపీ నేతలు టీడీపీలో చేరిక శుభపరిణామం'

కడప ఎడ్యుకేషన్, డిసెంబరు 17 (ఆంధ్రజ్యోతి): కడప నగర అభివృద్ధికి ఎమ్మెల్యే మాధవీరెడ్డి, టీడీపీ జిల్లా అధ్యక్షుడు శ్రీనివాసరెడ్డి కృషికి చేదోడుగా వైసీపీ కార్పొరేటర్లు టీడీపీలో చేరడం అభినందనీయమని టీఎన్‌ఎస్ జిల్లా అధ్యక్షుడు బొజ్జ తిరుమలేష్ పేర్కొన్నారు. మంగళవారం టీఎన్‌ఎస్‌ఎఫ్ జిల్లా కార్యాలయంలో ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఎమ్మెల్యే మాధవి నగర అభివృద్ధికి ప్రత్యేక ప్రణాళికలు రూపొందించిందన్నారు. ఇందుకు ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు కూడా ఎమ్మెల్యేకు మద్దతు ఇచ్చి రాష్ట్రంలోనే ఆదర్శ కార్పొరేషన్‌గా తీర్చిదిద్దేందుకు సహకరిస్తున్నారన్నారు.

సెమిస్టర్ పరీక్షల ఫలితాలు విడుదల

కడప ఎడ్యుకేషన్, డిసెంబరు 17 (ఆంధ్రజ్యోతి): కోటిరెడ్డి ప్రభుత్వం మహిళా కళాశాలలో మూడవ సెమిస్టర్, ఐదవ సెమిస్టర్ ఫలితాలను విడుదల చేసినట్లు కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ వి.సలీం బాషా తెలిపారు. మంగళవారం కోటిరెడ్డి ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాలలో ఫలితాలను విడుదల చేశారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ మాట్లాడుతూ మూవ సెమిస్టర్ విద్యార్థులు 79.4శాతం, ఐదవ సెమిస్టర్ పరీక్షల్లో 91.4శాతం మంద ఉత్తీర్ణులయ్యారన్నారు. కళాశాల కంట్రోల్ ఆఫ్ ఎగ్జామినేషన్స్ రాఘవేంద్ర, అసిస్టెంట్ కంట్రోలర్ ఆఫ్ ఎగ్జామినేషన్ డాక్టర్ సుబ్రమణ్యం, హరిత, అకాడమిక్ కోఆర్డినేటర్ డాక్టర్ నాగమునిరెడ్డ అధ్యాపకులు పాల్గొన్నారు.

వేమన పద్యాలను కన్నడ భాషలో రచించడం అభినందనీయం



పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న వక్తలు

కడప నాగరాజుపేట, డిసెంబరు 17(ఆంధ్రజ్యోతి): యోగి వేమన పద్యాలను కన్నడ భాషలో రచించి పుస్తక రూపంలోకి తేవడం అభినందనీయమని రచయితల సంఘం జిల్లా అధ్యక్షుడు ఆచార్య మూల మల్లికార్జునరెడ్డి అన్నారు. మంగళవారం కడప రెడ్డి సేవా సమితి సమావేశ మందిరంలో జిల్లా రచయితల సంఘం, రెడ్డి సేవా సమితి సంయుక్త ఆధ్వర్యంలో పుస్తకాన్ని లెక్కల కొండారెడ్డి ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మల్లికార్జునరెడ్డి మాట్లాడుతూ ఆచార్య జి.శివారెడ్డి వ్యాఖ్యానం చేసిన వేమన పద్యాలను కర్ణాటక ధార్వాడ్ విశ్వవిద్యాలయం ప్రోత్సాహంతో మహాయోగి వేమన పీఠాధిపతి హేమారెడ్డి కన్నడ భాషలో మల్లేశప్పతో అనువాదం చేయించి 10 వేల కాపీలను ప్రచురించారన్నారు. విశ్వదాభిరామ అనగా విశ్వమంతా నిండి ఉన్న శూన్యరూప శివుడు అనే అర్థం చెప్పి వేమన శూన్యరూపుడిగానే శివుని ధ్యానించారని శివారెడ్డి వేమన దృక్పథాన్ని సరికొత్త కోణంలో ఆవిష్కరించారన్నారు. వేమనను శూన్యవాదిగా చెప్పిన మొట్టమొదటి వ్యక్తి శివారెడ్డి అన్నారు. అనంతరం రెడ్డి సేవా సమితి ప్రధాన కార్యదర్శి లెక్కల కొండారెడ్డి, అధ్యక్షుడు కుప్పిరెడ్డి నాగిరెడ్డి, కోశాధికారి గుడ్ల ఆదినారాయణరెడ్డి మాట్లాడారు. ఈ కార్యక్రమంలో రచయితల సంఘం సంయుక్త కార్యదర్శి డాక్టర్ భూతపురి గోపాలకృష్ణశాస్త్రి, సభ్యులు డాక్టర్ వెల్లాల వెంకటేశ్వరాచారి, డాక్టర్ అనుగూరు చంద్రశేఖరరెడ్డి, మాచిరెడ్డి రమణయ్య తదితరులు పాల్గొన్నారు.

భూముల అక్రమ రిజిస్ట్రేషన్‌పై చర్యలు తీసుకోవాలి

- పాములూరు రెవెన్యూ సదస్సులో ఫిర్యాదు



పాములూరు గ్రామంలో నిర్వహించిన రెవెన్యూ సదస్సులో తహసీల్దార్‌కు ఫిర్యాదు చేస్తున్న రైతులు

వేంపల్లె, డిసెంబరు 17 (ఆంధ్రజ్యోతి): భూముల అక్రమ రిజిస్ట్రేషన్‌పై చర్యలు తీసుకోవాలని కత్తులూరు గ్రామానికి చెందిన రైతు రామలింగారెడ్డి తహసీల్దార్ హరనాథ్‌రెడ్డికి ఫిర్యాదు చేశారు. మంగళవారం పాములూరు గ్రామంలో రెవెన్యూ సదస్సు జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మండలంలోని పాములూరు పొలంలో ఉన్న తమ భూమిని తప్పుడు పత్రాలతో అదే గ్రామానికి చెందిన రిటైర్డ్ వీఆర్వో కోడూరు చిన్న నాగసుబ్బారెడ్డి రిజిస్ట్రేషన్ చేయించుకున్నారని ఆరోపించారు. పలు సర్వేనెంబర్లలో 5 ఎకరాలకు పైగా ఉన్న భూమిని అక్రమంగా చేసుకున్న రిజిస్ట్రేషన్‌ను రద్దుచేయించాలన్నారు. దీనిపై ఆరోపణలు ఎదుర్కొంటున్న చిన్న నాగసుబ్బారెడ్డి మాట్లాడుతూ ఇతరుల ద్వారా ఆ భూమిని కొనుగోలు చేశానని, రికార్డులు ఉన్నాయన్నారు. గతంలో తహసీల్దార్‌కు ఫిర్యాదు చేశారని విచారణలో వారి పేరుతో భూమి లేదని తేలిందన్నారు. కాగా ఈ విషయంపై తహసీల్దార్ మాట్లాడుతూ విచారణ చేపట్టి రికార్డులన్నీ పరిశీలించిన తర్వాత తగు చర్యలు తీసుకుంటామన్నారు.

ప్రభుత్వం భూములను ఆక్రమిస్తున్నారు

పాములూరు గుట్ట ప్రాంతంలో ఉన్న ప్రభుత్వ భూములను ఆక్రమిస్తున్నారని, ఎవరూ ఆక్రమించకుండా అడ్డుకోవాలని ఆ గ్రామ మాజీ ఉపసర్పంచు మధుప్రభాకర్‌రెడ్డి, అయ్యవారిపల్లె రామగంగిరెడ్డి తహసీల్దార్‌కు విజ్ఞప్తి చేశారు. దీనిపై స్పందించిన తహసీల్దార్ హరనాథ్‌రెడ్డి పూర్తి వివరాలు ఇవ్వాలని వీఆర్వోను ఆదేశించారు.

జాకీర్ హుస్సేన్ మృతి తీరని లోటు : అమీర్‌బాబు



నివాళులర్పిస్తున్న అమీర్ బాబు

కడప కల్చరల్, డిసెంబరు 17 (ఆంధ్రజ్యోతి): ప్రఖ్యాత తబలా విద్వాంసుడు జాకీర్ హుస్సేన్ మృతి సంగీతాభిమానులకు తీరని లోటు అని తెలుగుదేశం పార్టీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు వి.ఎస్. అమీర్ బాబు పేర్కొన్నారు. మంగళవారం స్థానిక కో-ఆపరేటివ్ కాలనీలో గల ఆయన కార్యాలయంలో జాకీర్ హుస్సేన్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. చిన్నతనం నుంచే తబలా వాయిద్యం పట్ల ఆసక్తితో జాకీర్ హుస్సేన్ తన తండ్రి వద్ద విద్య నేర్చుకుని కేవలం 11 సంవత్సరాల వయసులోనే పలు కచేరీలు నిర్వహించి ప్రజల మన్ననలు అందుకున్నారన్నారు. ఆయన మృతితో సంగీతాభిమానులు తీవ్ర మనోవేదనకు లోనయ్యారని విచారం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నాయకులు కరీముల్లా, నాసర్ అలీ, నూర్‌బాషా, ఏజాస్, ఆదిల్, తౌసీఫ్, కరీం పాల్గొన్నారు.

రైతులకు సాంకేతిక పరిజ్ఞానం అందించాలి



యూనిట్లను పరిశీలిస్తున్న శివనారాయణ

సికెదిన్నె, డిసెంబరు 17(ఆంధ్రజ్యోతి): రైతులకు సాంకేతిక పరిజ్ఞానం అందించాలని ఆచార్య ఎన్‌జీ రంగా విశ్వవిద్యాలయం విస్తరణ సంచాలకులు డాక్టర్ శివనారాయణ తెలిపారు. మంగళవారం స్థానిక కృషి విజ్ఞాన కేంద్రాన్ని సందర్శించి రికార్డులు, ఉత్పత్తి కేంద్రాలను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ చిరుధాన్యాలకు విలువ జోడింపు ద్వారా పౌష్టికాహారం అందించడంతో పాటు పుట్టగొడుగుల పెంపకం, వానపాముల ఎరువు తయారీకి యువతకు సాంకేతిక శిక్షణ అందించి వారి స్వయం ఉపాధికి కృషి చేయాలన్నారు. ఆయా యూనిట్లను పరిశీలించి పనితీరును తెలుసుకున్నారు ఈ కార్యక్రమంలో కేవీకే సమన్వయకర్త డాక్టర్ వీరయ్య, ఏరువాక సమన్వయకర్త అంకయ్యకుమార్ కేవీకే శాస్త్రవేత్తలు మహేష్‌బాబు, సాయిమహేశ్వరి,మానస సురేష్‌కుమార్‌రెడ్డి పాల్గొన్నారు

పేదరిక నిర్మూలనపై శిక్షణ

వేముల, డిసెంబరు 17 (ఆంధ్రజ్యోతి): స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీడీఓ మల్లికార్జునరెడ్డి ఆధ్వర్యంలో సుస్థిర అభివృద్ధి, పేదరిక నిర్మూలనపై శిక్షణ మంగళవారం శిక్షణ ఇచ్చారు. సర్పంచులు మండలస్థాయి అధికారులు, సచివాలయ సిబ్బందికి శిక్షణ పొందిన మండలస్థాయి అధికారులకు శిక్షణ ఇచ్చారు. రాష్ట్ర మానవ వనరుల అభివృద్ధి సంస్థ నుంచి కుమారి భార్గవి పరిశీలకులుగా పాల్గొని మాట్లాడారు.

సుస్థిర అభివృద్ధి లక్ష్యాల సాధనకు కృషిచేయాలి

వీరపునాయనిపల్లె, డిసెంబరు 17 (ఆంధ్రజ్యోతి): సుస్థిరాభివృద్ధి లక్ష్యాల సాధనకు ప్రతి ఉద్యోగి కృషిచేయాలని ఎంపీడీఓ చంద్రమౌళీశ్వర్ అన్నారు. మంగళవారం సుస్థిర అభివృద్ధి లక్ష్యాలు-సాధన నిమిత్తం సమాజంలోని అన్ని వర్గాల ప్రజల సమన్వయంతోనే సాధ్యమనే భావనపై శిక్షణ జరిగింది. ఈఓపీఆర్డీ రామ్‌సింగ్, ఎంఈఓ జాఫర్‌సాదిక్, ఎంటటి నాగభూషరెడ్డి తెలిపారు.

బాధ్యతగా పనిచేసి రైతుల మన్ననలు పొందండి: ఎమ్మెల్యే



ఎమ్మెల్యే పుత్రా క్రిష్ణచైతన్యరెడ్డిని సన్మానిస్తున్న నీటి సంఘం అధ్యక్షులు

చెన్నూరు, డిసెంబర్ 17 (ఆంధ్రజ్యోతి): కేసీ కెనాల్ డిస్ట్రిబ్యూటరీ కమిటీ చైర్మన్‌గా నీటి సంఘాల అధ్యక్షులుగా నియమితులైన వారంతా బాధ్యతతో పనిచేసి రైతుల మన్ననలు పొందాలని ఎమ్మెల్యే పుత్రా క్రిష్ణచైతన్యరెడ్డి అన్నారు. నీటి సంఘాల అధ్యక్షులుగా ఎన్నికైన వెంకటసుబ్బారెడ్డి, శంకర్‌రెడ్డి, శ్రీనివాసులు ఎమ్మెల్యేను సత్కరించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ అన్నదాతలు రైతులే అన్నారు. సాగు నీరు అందించడంలో నిర్లక్ష్యం చేయరాదన్నారు. బాధ్యతతో కూడిన పదవి ఎంతో విలువైందన్నారు. కేసీ ఆయకట్టు కింద ప్రతి రైతూ బాగుపడాలన్నారు. మంచి పంటలు పండించి పదిమందికీ అన్నం పెట్టాలన్నారు. ఈ కార్యక్రమంలో టీడీపీ సీనియర్ నేతలు విజయభాస్కర్‌రెడ్డ, శివారెడ్డి, ఖాజా హుస్సేన్, మల్లికార్జునరెడ్డ, గౌస్‌పీర్, గోవిందరెడ్డి, ఆకు చలపతి, ముక్తియార్, భవానీశ చారి, సుదర్శన్‌రెడ్డి, మన్నూరు అక్బర్, సుబ్రమణ్యం శ్రీనివాసులురెడ్డి తదితరులు పాల్గొన్నారు.

కేసీ కెనాల్ డిస్ట్రిబ్యూటరీ కమిటీ చైర్మన్‌గా వెంకటసుబ్బారెడ్డి

చెన్నూరు, డిసెంబర్ 17 (ఆంధ్రజ్యోతి): కేసీ కెనాల్ డిస్ట్రిబ్యూటరీ కమిటీ చైర్మన్‌గా ఆలంఖాన్‌పల్లె నీటి సంఘం అధ్యక్షుడు తాడిగట్ల వెంకటసుబ్బారెడ్డి (బుజ్జన్న)ను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. మంగళవారం కడప కేసీ కెనాల్ కార్యాలయంలో చెన్నూరు, చిన్నమాచుపల్లె, ఉక్కాయపల్లె, పాతకడప లకు చెందిన నీటిసంఘం అధ్యక్షులు జి.శ్రీనివాసులు, ఆవుల శంకర్‌రెడ్డి, నారాయణరెడ్డి, రవికుమార్‌లు ఆయన్ను ఎన్నుకున్నారు. అలాగే పాతకడప నీటి సంఘం అధ్యక్షుడిని వైస్ చైర్మన్‌గా ఎన్నుకున్నారు. కేసీ కెనాల్ ఈఈ రవికుమార్ నియామక పత్రం అందజేశారు. కార్యక్రమంలో జిల్లా గ్రంథాలయ సంస్థ మాజీ చైర్మన్ రామకోటిరెడ్డి, మండల కన్వీనర్ విజయ్‌భాస్కర్‌రెడ్డి, మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ శివారెడ్డి, జిల్లా మైనార్టీ నేత షబ్బీర్ హుస్సేన్, రైతు విభాగం రాష్ట్ర కార్యదర్శి మల్లికార్జునరెడ్డి, కార్యదర్శి ముక్తియార్, సీనియర్ టీడీపీత నేతలు చంద్రమోహన్‌రెడ్డి, అధికార ప్రతినిధులు మన్నూరు అక్బర్, శ్రీనివాసులురెడ్డి, రాజశేఖర్‌రెడ్డి, వేల్పుల సుబ్రమణ్యం నీటిపారుదల సంఘం ఉపాధ్యక్షులు జగన్‌మోహన్‌రెడ్డి, హరీంద్రారెడ్డి, డీఈ సుబ్బరాయుడు, ఏఈ గంగిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

పీబీసీ కమిటీ చైర్మన్ ఎన్నిక

వేంపల్లె, డిసెంబరు 17 (ఆంధ్రజ్యోతి): పులివెందుల బ్రాంచ్ కెనాల్ 3వ సాగునీటి సంఘం (వేంపల్లె) డిస్ట్రిబ్యూషన్ కమిటీ అధ్యక్ష, ఉపాధ్యక్ష ఎన్నిక స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో మంగళవారం జరిగాయి. అధ్యక్షుడిగా వేముల మండలం నల్లచెరువుపల్లెకు చెందిన అన్నారెడ్డి వెంకటలక్ష్మీరెడ్డిని ఎన్నుకున్నారు. సభ్యులు మల్లంగి రామగంగిరెడ్డి, గొల్లలగూడూరు మల్లికార్జునరెడ్డి, కొత్తపల్లె రాజశేఖర్‌రెడ్డి, చింతలమడుగుపల్లె పద్మావతి చైర్మన్‌ను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. టీడీపీ నేతలు మునిరెడ్డి, శివమోహన్‌రెడ్డి, అన్నారెడ్డి బాలస్వామిరెడ్డి, షబ్బీర్, జగన్నాథరెడ్డి పాల్గొన్నారు.

పులివెందుల సాగునీటి సంఘాల డిస్ట్రిబ్యూటరీ కమిటీ చైర్మన్‌గా జోగిరెడ్డి

సింహాద్రిపురం, డిసెంబరు 17(ఆంధ్రజ్యోతి) పులివెందుల సాగునీటి సంఘాల డిస్ట్రిబ్యూటరీ కమిటీ చైర్మన్‌గా సింహాద్రిపురం టీడీపీ మండల ఇన్‌చార్జ్ మారెడ్డి జోగిరెడ్డి ఏకగ్రీవంగాఎన్నికైనట్లు నీటి పారుదల శాఖ అధికారులు ప్రకటించారు. ఈ సందర్భంగా జోగిరెడ్డి మాట్లాడుతూ టీడీపీ పులివెందుల నియోజకవర్గ ఇన్‌చార్జ్ మారెడ్డి రవీంద్రనాథరెడ్డి సహకారంతో పలివెందుల నియోజకవర్గం పరిధిలో చివరి ఆయకట్టు వరకు నీటిని అందించడంతో పాటు, పీబీసీ కాలువల మరమ్మతులు చేపట్టి రైతులకు ఎల్లవేళలా అందుబాటులో ఉంటాన న్నారు. పులివెందుల బ్రాంచి కాలువ(పీబీసీ) అధికారులు, కమిటీ అధ్యక్షులు, రైతులు పాల్గొన్నారు.

ప్రకృతి వ్యవసాయ విధానాలను పరిశీలించిన యూరోపియన్ ఇటలీ బృందం



ప్రకృతి వ్యవసాయ పద్ధతులను వివరిస్తున్న ఏపీఎం ఆంజనేయులు

వేముల, డిసెంబరు 17 (ఆంధ్రజ్యోతి): మండలంలోని దుగ్గన్నగారిపల్లెలో మహిళా రైతులు చేపట్టిన ప్రకృతి వ్యవసాయ విధానాలను వెలుగు ఏపీఎం ఆంజనేయులుతో కలిసి మంగళవారం యూరోపియన్ ఇటలీ దేశ బృంద సభ్యులు డాక్టర్ అన్నా పరిశీలించారు. చామంతి పూలు, బుడ్డశనగ పంటలను పరిశీలించారు. ప్రకృతి వ్యవసాయ విధానాలలో ఏగ్రేడ్, ఏటీఎం మోడల్ కూరగాయల సాగు విధానాన్ని మహిళా సంఘ సభ్యులను అడిగి తెలుసుకున్నారు. ఏపీఎం ఆంజనేయులు మాట్లాడుతూ ప్రకృతి వ్యవసాయ పద్ధతులు, ఉపయోగాలు, ఆదాయ మార్గాలను వి వరించారు.

ఉపాధి పనులను సద్వినియోగం చేసుకోవాలి



ఉపాధి పనులను పరిశీలిస్తున్న పీడీ ఆదిశేషారెడ్డి

సికెదిన్నె, డిసెంబరు 17(ఆంధ్రజ్యోతి): ఉపాధి పనులను ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలని డ్వామా పీడీ ఆదిశేషారెడ్డి పేర్కొన్నారు మండలంలోని అశ్వత్తగారిపల్లెలో జరుగుతున్న పశువుల షెడ్ల నిర్మాణాన్ని, బుసిరెడ్డిపల్లెలో జరుగుతున్న సీసీ రోడ్లను ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పనులన్నీ నాణ్యతగా చేపట్టాలన్నారు. ఉపాధి పనుల్లో కూలీల సంఖ్యను పెంచుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో ఏపీడీ సోమశేఖర్‌రెడ్డి, ఏపీఓ రామాంజుల్‌రెడ్డి, ఇంజనీర్ బాలవర్ధిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

'మీరైనా మా సమస్యలు తీర్చండి'

చెన్నూరు, డిసెంబరు 17 (ఆంధ్రజ్యోతి): గత ఐదు సంవత్సరాల వైసీపీ పాలనలో అధికారుల చుట్టూ తిరిగినా సమస్యలు పరిష్కారం కాలేదని, మీరైనా మా ఇబ్బందులు తొలగించాలని రామనపల్లె రైతులు తహసీల్దార్ సరస్వతిని కోరారు. మంగళవారం రామనపల్లెలో జరిగిన రెవెన్యూ సదస్సులో ఇద్దరు మహిళా రైతులు మాట్లాడుతూ చుక్కల భూముల సమస్యలతో ఇబ్బంది పడుతున్నామని, ఆ భూమికి కొలతలు తక్కువగా చూపించి గతంలో ఇబ్బందులు పెట్టారన్నారు. అలాగే భూములు ఆన్‌లైన్ చేయకుండా ఇబ్బంది పెట్టారని పలువురు రైతులు పేర్కొన్నారు. తహసీల్దార్ మాట్లాడుతూ సమస్యలు త్వరిగతిన పరిష్కరిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచ్‌లు రామన శ్రీలక్ష్మి, చంద్రమోహన్‌రెడ్డి, ఆర్ఐ కౌశిక్, వీఆర్‌ఓలు వేణు, ఖలీల్, రైతులు పాల్గొన్నారు.

పంట వివరాలను నమోదు చేయాలి

కడప రూరల్, డిసెంబరు 17(ఆంధ్రజ్యోతి) : ప్రతి రైతూ సాగుచేసిన పంట వివరాలను ఈ - క్రాప్‌లో నమోదు చేయాలని కడప ఏడీఏ శంకర్‌నాయక్ తెలిపారు. కడప నగరం నానాపల్లెలో మంగళవారం పొలం పిలుస్తోంది కార్యక్రమాన్ని ఏఓ సురేష్‌కుమార్‌రెడ్డి ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ సందర్భంగా ఏడీఏ శంకర్‌నాయక్ మాట్లాడుతూ రబీలో వరిపంట ఇన్సూరెన్స్ ప్రీమియంను డిసెంబరు 31లోపు చెల్లించాలన్నారు.

'ఏపీజీబీ ప్రధాన కార్యాలయాన్ని కడపలోనే కొనసాగించాలి'

కడప సెవెన్‌రోడ్స్, డిసెంబరు 17 (ఆంధ్రజ్యోతి):ఆంధ్రప్రగతి గ్రామీణ బ్యాంకు ప్రధాన కార్యాలయాన్ని కడపలోనే కొనసాగించాలని మాజీ ఎమ్మెల్సీ డాక్టర్ ఎం.గేయానంద్ కోరారు. మంగళవారం యూటీఎఫ్ భవన్‌లో సేవ్ పబ్లిక్ సెక్టార్ కడప ఆధ్వర్యంలో జరిగిన సదస్సులో ఆయన మాట్లాడారు. ఇప్పటికే రాయలసీమ ప్రాంతంలో ఉన్న హైకోర్టు, లా యూనివర్సిటీ, ఎంఎస్‌ఎంఈ కేంద్రం, గతంలో అనంతపురానికి రావాల్సిన ఎయిమ్స్‌ను తరలించి రాయలసీమ ప్రాంతాలకు అన్యాయం చేశారని, ఈ ఒరవడిని ఇలా కొనసాగించవద్దని వక్తలు కోరారు.

ఫుట్‌పాత్ ఆక్రమణలతో ట్రాఫిక్ సమస్యలు

● లక్షలు వెచ్చించి నిర్మిస్తే వ్యాపారుల ఆక్రమణ ● ఫుట్‌పాత్‌పై నడవాల్సిన పాదచారులు రోడ్లపై... ● మునిసిపల్, పోలీస్ అధికారుల సమన్వయ లోపం

ప్రొద్దుటూరు అర్బన్ డిసెంబరు 17(ఆంధ్రజ్యోతి): ఫుట్‌పాత్‌లు పాదచారుల భద్రతకు, సౌకర్యానికి నిర్మించిన ప్రదేశాలు, అయితే ప్రస్తుతం అవి వ్యాపార కార్యకల పాలు, ఇతర ఆక్రమణలతో ప్రజలకు అసౌ కర్యం కలిగిస్తున్నాయి. ప్రొద్దుటూరు పట్టణం లోని శివాలయం సర్కిల్ నుంచి మైదుకూరు రోడ్డులో నూతనంగా నిర్మించిన ఫుట్‌పాత్, శివాలయం నుంచి పొట్టి శ్రీరాముల విగ్రహం వరకు ఉన్న ఫుట్‌పాత్‌లను స్థానికంగా ఉన్న కొంత మంది వ్యాపారులు వాటిని ఆక్రమించు కొని వాటిపైనే వ్యాపార కార్యకలపాలు నిర్వహిస్తున్నారు. ఫుట్‌పాత్‌లు ఆక్రమణలకు గురికావడం వల్ల పాదచారులు రోడ్డుపై నడవాల్సి వస్తోంది. ఈ విధమైన ప్రయాణం ప్రమాదాలకు దారితీస్తుంది.

●ఆక్రమణలతో ట్రాఫిక్ సమస్యలు..: ఆక్రమణల కారణంగా రోడ్ల వెడల్పు తగ్గి ట్రాఫిక్ సమస్యలు పెరుగుతున్నాయి. శివాలయం రోడ్డు నుంచి గాంధీ రోడ్డుకు అనుసంధానంగా ఉండి నిత్యం రద్దీగా ఉండే గంగమ్మ దేవలం, సుందరయ్యచారుల వీధి, కొనేటి కాల్వ, శ్రీరాముల పేట, హోమస్ పేట వీధుల లో కొన్ని అక్రమ, ఆక్రమ కట్టడాల వలన రోడ్లు కుచించుకొనిపోయి ట్రాఫిక్ తీవ్ర అంతరాయం కలుగుతుంది.

● ప్రభుత్వం తగిన చర్యలు..: చట్టాల అమలు



మైదుకూరు రోడ్డులో ఆక్రమణకు గురైన ఫుట్‌పాత్

ఆక్రమణలను తొలగించేందుకు ప్రామాణిక చట్టాలు రూపొందించి, ఫుట్‌పాత్ ఆక్రమణ దారులపై కఠిన చర్యలు తీసుకొని మరలా పునరావృతం కాకుండా, పాదచారులకు ఆటంకం కలిగించకుండా ఉండేలా వారిపై అధికారులు చట్టపరమైన చర్యలు తీసుకొవాలి. మున్సిపల్ అధికారుల, పోలీసుల సమన్వయ లోపంతోనే ఆక్రమణదారులు ఫుట్‌పాత్‌లను ఆక్రమించి వారి వ్యాపారాలు కొనసాగిస్తున్నారు. మున్సిపల్, పోలీసు అధికారుల సమన్వయంతో ఆక్రమణలను తొలగించవచ్చు.

● జన జాగృతి..: పాదచారుల హక్కులపై ప్రజలకు అవగహన కల్పించి, ఫుట్‌పాత్ ఆక్రమణలను నివారించ డానికి సామాజిక సహకారంతో అధికారులు అవగహన కార్యక్రమాలతో ముందుకు నడవాలి. ఫుట్‌పాత్ ఆక్రమణ సమస్య పాద చారుల హక్కులను, నగరాల అందాన్ని దెబ్బతీస్తుంది.

ఆక్రణదారులపై చర్యలు తీసుకుంటాం

ఫుట్‌పాత్ ఆక్రమించి పాదచారులకు ఇబ్బందులకు గురి చేస్తున్న వ్యాపారులకు కౌన్సెలింగ్ ఇస్తాం. రెండు నెలల వ్యవధిలో దాదాపు 350 కేసులు నమోదు చేశాం. మరల పునరావృతం కాకుండా వారిపై చట్టపరమైన చర్యలు తీసుకుంటాం. ప్రతి రోజు పెట్రోలింగ్ నిర్వహిస్తున్నాం. ఫుట్‌పాత్ వినియోగంపై ప్రజలకు అవగహన కల్పిస్తాం.

దేవకిరణ్ కుమార్, ట్రాఫిక్ సీఐ

దీనిపై ప్రభుత్వం, ప్రజలు కలసి కట్టుగా చర్యలు తీసుకొవడం ద్వారా ఈ సమస్యకు పరిష్కరం చూపవచ్చు.



ఆక్రమణలతో ఇరుకుగా మారిన గంగమ్మ దేవళం వీధిలో ట్రాఫిక్ జామ్

అదుపులో శాంతిభద్రతలు

మహమ్మద్ రఫీ, కొండాపురం సీఐ



కొండాపురం, డిసెంబరు 17 (ఆంధ్రజ్యోతి): జిల్లా సరిహద్దుల్లో శాంతిభద్రతలు అదుపులోనే ఉన్నట్లు కొండాపురం సీఐ మహమ్మద్‌రఫీ తెలిపారు. మండలంలోని జిల్లా సరిహద్దుల్లో ఉన్న కె.సుగుమంచిపల్లె వద్ద ప్రస్తుతం పికెటింగ్ కొనసాగుతోందని ఆయన తెలిపారు.

ప్రశ్న: కొండాపురం సర్కిల్ పరిధిలో ఏ పోలీసుస్టేషన్‌లు వస్తాయి?

జవాబు: కొండాపురం, తాళ్లప్రొద్దుటూరు, ఎర్రగుంట్ల మండలంలోని కల్లమల్ల పోలీసు స్టేషన్‌లు కొండాపురం సర్కిల్ పరిధిలోకి వస్తాయి.

ప్రశ్న : హైడ్రోపవర్‌ప్లాంట్ దగ్గర ప్రస్తుతం పరిస్థితి ఎలా ఉంది?

ముఖాముఖి

జవాబు: కొండాపురం మండలంలోని దొంతికోన వద్ద చేపడుతున్న హైడ్రోపవర్ ప్లాంట్ వద్ద ప్రస్తుతం ప్రశాంతంగా ఉంది.

ప్రశ్న: ఫ్యాక్షన్ గ్రామాల్లో ఎలాంటి చర్యలు తీసుకుంటున్నారు?

జవాబు: మండలంలోని ఫ్యాక్షన్ గ్రామాల్లో తరచు పర్యటిస్తున్నాం. రౌడీషీటర్లను పిలిపించి కౌన్సెలింగ్ నిర్వహిస్తున్నాం

ప్రశ్న: గంజాయి, ఈవ్‌టీజింగ్ కట్టడికి ఎలాంటి చర్యలు చేపట్టారు?

జవాబు: గంజాయి, ఈవ్‌టీజింగ్ కట్టడికి ప్రభుత్వం ప్రత్యేక చర్యలు తీసుకుంటోంది. అందులో భాగంగా వీటిని కట్టడి చేసేందుకు విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్నాం.

ప్రశ్న: ట్రాఫిక్ నియంత్రణకు ఎలాంటి చర్యలు తీసుకుంటున్నారు?

జవాబు: ప్రస్తుతం ముద్దనూరు-తాడిపత్రి మధ్య ఫోర్‌వే నేషనల్ హైవే పనులు జరుగుతున్నాయి. ట్రాఫిక్‌కు ఇబ్బంది కలగకుండా నిర్మాణం పనులు చేపట్టాలని నిర్మాణసంస్థకు సూచించాం.

ప్రశ్న: మట్కా, జూదం అదపులోనే ఉన్నాయా?

జవాబు: కొండాపురం సర్కిల్ పరిధిలో మట్కా, జూదం అదుపులోనే ఉన్నాయి. వీటి కట్టడికి ప్రత్యేకంగా చర్యలు తీసుకుంటున్నాం.

ప్రశ్న: కొండాపురం సర్కిల్ పరిధిలో శాంతిభద్రతలు అదుపులో ఉన్నాయా?

జవాబు: కొండాపురం సర్కిల్ పరిధిలో ప్రస్తుతం శాంతిభద్రతలు అదుపులోనే ఉన్నాయి. గతంలో కంటే క్రైం రేటు తగ్గింది.

పీఆర్‌సీని తక్షణమే అమలు చేయాలి

బద్వేలు, డిసెంబరు 17 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రప్రభుత్వ ఉద్యోగ, ఉపాధ్యాయులకు తక్షణమే పీఆర్‌సీని అమలు చేయాలని ఉపాధ్యాయ సంఘాల ఐక్యవేదిక నాయకులు మాదన విజయ్‌కుమార్, జి.వెంకటసుబ్బారెడ్డి, గోపాల్‌రెడ్డి , ఓబుల్‌రెడ్డి, తదితరులు డిమాండ్ చేశారు. మంగళవారం స్థానిక జిల్లా పరిషత్ బాలుర ఉన్నత పాఠశాల ఆవరణలో ఉపాధ్యాయ సంఘాల ఐక్య వేదిక ఆధ్వర్యంలో విలేకర్ల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కూటమి ప్రభుత్వంతో అయినా తమ సమస్యలు పరిష్కారమవుతాయని భావించి పట్టం కట్టినట్లు ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో రవిశంకర్, నరసింహారెడ్డి, రమేష్‌రాజా పాల్గొన్నారు.

నీటి సంఘం చైర్మన్, వైస్ చైర్మన్‌కు సన్మానం



బద్వేలు, డిసెంబర్ 17 (ఆంధ్రజ్యోతి): ఇటీవల జరిగిన సాగునీటి సంఘం ఎన్నికలలో బద్వేలు చిన్న తూము చైర్మన్‌గా కొర్రపాటి సురేంద్ర, పెద్దతూము వైస్ చైర్మన్‌గా డి.వెంకటేశ్వర్లు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. మంగళవారం బలిజ సేవా సంఘం అధ్యక్షుడు వెంకటసుబ్బయ్య ఆధ్వర్యంలో పట్టణంలోని బలిజ సేవాసంఘం కార్యాలయంలో చైర్మన్, వైస్ చైర్మన్‌లను ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో బలిజసేవా సంఘం ప్రధాన కార్యదర్శి కొంకుల వెంకటరమణ, మాజీ టీడీపీ పట్టణ అధ్యక్షుడు కొంకుల రాంబాబు, పెరుగు వెంకటయ్య, దద్దం నాగార్జున, బాసికాల శ్రీను, రాజేష్, తదితరులు పాల్గొన్నారు.

మైదుకూరు రోడ్డు విస్తరణలో కట్టడాల తొలగింపు

ప్రొద్దుటూరు, డిసెంబరు 17 (ఆంధ్రజ్యోతి) : ప్రొద్దుటూరు మండల పరిధిలోని కొత్తపల్లెపంచాయతీ మైదుకూరు రోడ్డు విస్తరణ పనులు అడ్డదిడ్డంగా జరగడంతో తహసీల్దారు గంగయ్య స్వయంగా పర్యవేక్షించారు. మంగళవారం ఆయన విస్తరణలో ఇంకా తొలగించక వదిలేసిన కట్టడాలను యంత్రాలతో కూల్చివేయించారు. మైదుకూరు రోడ్డు ను 100 అడుగుల మేర విస్తరించడానికి 1978లోనే భూ యజమానులకు నష్టపరిహారం ఇచ్చారని వారు ఎటువంటి అభ్యంతరం తెలపడానికి వీలు లేదని ఆయన తెలిపారు.మార్కింగ్ ఇచ్చినంత మేరకు కట్టడాలను పూర్తిగా తొలగించాలని ఇందులో ఎలాంటి సడలింపు లేదన్నారు.

సమష్టి కృషితోనే గ్రామాల అభివృద్ధి-జడ్పీ సీఈవో ఓబులమ్మ

ఎర్రగుంట్ల, డిసెంబరు 17 (ఆంధ్రజ్యోతి): అధికారుల, ప్రజా ప్రతినిధుల సమష్టి కృషితోనే గ్రామాల సుస్థిర అభివృద్ధి సాధ్యమవుతుందని జిల్లా పరిషత్ ముఖ్య కార్యదర్శి ఓబులమ్మ పేర్కొన్నారు. మంగళవారం ఎర్రగుంట్ల ఎంపీడీవో వెంకటరమణయ్య అధ్యక్షతన ఎంపీడీవో సభాభవనంలో సుస్థిర అభివృద్ధి లక్ష్యాల(ఎస్ఎస్‌డీజీ)పై సర్పంచులకు గ్రామ కార్యదర్శులకు ప్రత్యేక శిక్షణా కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు. మహాత్మాగాంధీ చిత్రపటానికి పూల మాల వేసి నివాళులర్పించారు. ఎంపీపీవో రమణయ్య, ఈవోఆర్డీ రంతులయ్య, ఏపీఎం జగదీశ్వరి, ఐసీడీయస్ సూపర్‌వైజర్ పాల్గొన్నారు.

'బకాయిలు చెల్లించని వారి కనెక్షన్లను తొలగించండి'

జమ్మలమడుగు, డిసెంబరు 17 (ఆంధ్రజ్యోతి): జమ్మలమడుగు విద్యుత్తు సబ్‌డివిజన్‌లో విద్యుత్తు బకాయిలు బాగా పేరుకుపోయాయని, ఎవరైతే డబ్బులు చెల్లించకుండా విద్యుత్తు వినియోగిస్తున్నారో వారి కనెక్షన్లను వెంటనే తొలగించాలని జిల్లా విద్యుత్తు శాఖ అధికారి ఎస్.రమణ తెలిపారు. మంగళవారం జమ్మలమడుగు పట్టణంలోని పలు వీధుల్లో సమస్యలున్న ట్రాన్స్‌ఫార్మర్లు, తీగలు, సబ్‌స్టేషన్‌ను క్షేత్రస్థాయిలో పరిశీలించారు. అనంతరం విద్యుత్ సబ్‌స్టేషన్ వద్ద సమావేశంలో ఆయన అధికారులకు సూచనలు, సలహాలు ఇచ్చారు. జమ్మలమడుగు, ప్రొద్దుటూరు ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్లు రాజగోపాల్, రమణారెడ్డి, ఏఈలు జేఈలు, అకౌంట్స్‌వారు, సిబ్బంది పాల్గొన్నారు.



ట్రాన్స్‌ఫార్మర్లను పరిశీలిస్తున్న ఎస్.రమణ

పెన్షనర్లు ప్రజాసేవకు అంకితం కండి

● ఆర్డీవో సాయిశ్రీ

జమ్మలమడుగు, డిసెంబరు 17 (ఆంధ్రజ్యోతి): పెన్షనర్లు ప్రతిరోజు యోగా, వ్యాయామంతోపాటు ఆరోగ్యంగా ఉంటూ ప్రజాసేవకు ముందుండాలని జమ్మలమడుగు ఆర్డీవో సాయిశ్రీ సూచించారు. మంగళవారం జమ్మలమడుగు ఆర్డీవో కార్యాలయ సభాభవనంలో జమ్మలమడుగు తాలూకా జాతీయ ప్రభుత్వ విశ్రాంత ఉద్యోగ దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ముఖ్య అతిథులుగా హాజరైన ఆర్డీవో సాయిశ్రీ, మాజీ ఎమ్మెల్సీ దేవగుడి నారాయణరెడ్డి పెన్షనర్లకు సూచనలు ఇచ్చారు. అనంతరం పెన్షనర్స్ సంఘం ఆధ్వర్యంలో తాలూకాలో 75 సంవత్సరాలు పూర్తి చేసుకున్న విశ్రాంత ఉద్యోగులకు 26 మందికి ఘనంగా సన్మానం చేశారు. అనంతరం జమ్మలమడుగు, మైలవరం, పెద్దముడియం మండలాల్లో గత ఏడాది 10వ తరగతిలో అత్యధిక మార్కులు సాధించిన విద్యార్థులకు బహుమతులు ప్రదానం చేశారు. ఈ కార్యక్రమంలో పెన్షనర్స్ అసోసియేషన్ సెక్రటరీ రామచంద్రారెడ్డి, కోశాధికారి సుబ్బారెడ్డి, వర్కింగ్ ప్రెసిడెంట్ రామయ్య, తదితరులు పాల్గొన్నారు.

బాధితులకు న్యాయం చేస్తాం

బ్రహ్మంగారిమఠం, డిసెంబరు 17 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని మల్లేపల్లె, ముడుమాల గ్రామాల్లోని రైతన్నల పంట పొలాలు నేషనల్ హైవే రోడ్ల కింద భూములు కోల్పోయిన బాధితులకు న్యాయం చేస్తామని వివరాలను జిల్లా అధికారులకు పంపించామని ఆర్డీవో చంద్రమోహన్ తెలిపారు. మంగళవారం ముడుమాల, మల్లేపల్లె రైతులు గ్రామ సచివాలయంలో సమావేశాన్ని చేపట్టారు. ఈ సమావేశంలో రోడ్డు విస్తరణ పనుల్లో భూములు కోల్పోయిన వారి రికార్డులను పరిశీలించారు.ఈసర్పంచ్ చిలమల నారాయణ, డీటీ జాన్సన్, రైతన్నలు పాల్గొన్నారు.

ఘనంగా వైఎస్ షర్మిలారెడ్డి జన్మదిన వేడుకలు



వృద్ధులకు పండ్లు అందజేస్తున్న విజయజ్యోతి

కాశినాయన డిసెంబరు17 (ఆంధ్రజ్యోతి): మండలంలోని అమగంపల్లె సమీపంలోగల బాలమ్మ సత్రంలో (అనాథాశ్రమంలో) కడప కాంగ్రెస్‌పార్టీ అధ్యక్షురాలు ఎన్‌డీ విజయజ్యోతి అధ్యక్షతన మంగళవారం ఆంధ్రప్రదేశ్ కాంగ్రెస్ కమిటీ అధ్యక్షురాలు వైఎస్ షర్మిలారెడ్డి జన్మదిన వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈసందర్భంగా విజయజ్యోతి కేక్ కట్‌చేసి వృద్ధులకు బ్రెడ్,పండ్లు అందజేశారు. ఈసందర్భంగా ఆమె మాట్లాడుతూ రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ బలోపేతానికి కృషిచేస్తున్న గొప్పనాయకురాలు షర్మిలారెడ్డి అని కొనియాడారు.ఈకార్యక్రమంలో పీసీసీ సభ్యుడు అన్వర్,కాంగ్రెస్ పార్టీనాయకులు సల్మాన్,బాషు,గురప్ప,చౌడేశ్వర్‌రావు తదితరులు పాల్గొన్నారు.

విద్యుత్ కార్మికులపై ప్రభుత్వాల సవతి తల్లి ప్రేమ

ఎర్రగుంట్ల, డిసెంబరు 17 (ఆంధ్రజ్యోతి): ఏపీ విద్యుత్ ఉద్యోగ,కార్మికుల విషయంలో ప్రభుత్వాలు సవతితల్లి ప్రేమను ప్రదర్శిస్తున్నాయని ఏపీ విద్యుత్ ట్రేడ్ యూనియన్స్ స్ట్రగుల్ కమిటీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వి.సుబ్బిరెడ్డి పేర్కొన్నారు. కమిటీ ఆధ్వర్యంలో కడపలో 22న నిర్వహించే రాయలసీమ జిల్లాల సదస్సును జయప్రదం చేయాలని మంగళవారం స్ట్రగుల్ కమిటీ ఆధ్వర్యంలో ఆర్టీపీపీ పవర్ హౌస్ మెయిన్ గేటు వద్ద కరపత్రాలను విడుదల చేశారు. ఈకార్యక్రమంలో స్ట్రగుల్ కమిటీ నాయకులు వెంకటస్వామి, కొండారెడ్డి, హరిఓబుళరెడ్డి,నరహింహులు, గిరబాబు, చిన్నరెడ్డి, గంగయ్య, పుల్లారెడ్డి తదితరులు పాల్గొని ప్రసంగించారు.

పెన్షనర్స్ అధ్యక్షుడిగా చిగురిపాటి సుబ్బరాయుడు



మైదుకూరు రూరల్,డిసెంబరు 17(ఆంధ్రజ్యోతి) : మైదుకూరు పెన్షనర్స్ సంఘం అధ్యక్షుడిగా చిగురిపాటి సుబ్బరాయుడు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. స్థానిక సాయినాధపురం ప్రాధమిక పాఠశాలలో మంగళవారం మండల పెన్షనర్స్ ఎన్నిక కోసం సమావేశం జరిగింది. ఈ ఎన్నికలో పెన్షనర్స్ అధ్యక్షుడు చిగురిపాటి సుబ్బరాయుడు,ఉపాధ్యక్షుడు పి.సుబ్బారెడ్డి, ప్రధాన కార్యదర్శి ఏ. వెంకటరమణయ్య, కార్యదర్శి బి.సుబ్బరాయుడు,కోశాధికారి యం. రామాంజినేయరెడ్డి,కార్యవర్గ సభ్యులు ఎన్నికయ్యారు.



ప్రొద్దుటూరు ఎమ్మెల్యే వరదరాజులరెడ్డిని కలిసి సన్మానిస్తున్న కేసీ కెనాల్ డిస్ట్రిబ్యూటరీ చైర్మన్ ధనిరెడ్డి రామచంద్రారెడ్డి, కుటుంబసభ్యులు

మైలవరం కెనాల్ డిస్ట్రిబ్యూటరీ కమిటీ చైర్మన్‌గా బూతూరు జయరామిరెడ్డి



మైలవరం ఉత్తర కాలువ డిస్ట్రిబ్యూటరీ చానల్ చైర్మెన్ గా ఎన్నికైన బూతూరు వెంకట జయరామిరెడ్డి

ప్రొద్దుటూరు ,డిసెంబరు 17 (ఆంధ్రజ్యోతి) : మైలవరం ఉత్తర కాలువ డిస్ట్రిబ్యూటరీ కమిటీ చైర్మన్‌గా బూతూరు జయరామిరెడ్డి, వైస్ చైర్మన్‌గా ఎద్దుల ప్రభాకర్‌రెడ్డి ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఆమేరకు రాజుపాళెం తహసీల్దారు కార్యాలయంలో మైలవరం ఉత్తర కెనాల్ పరిధిలోని సాగునీటి సంఘాల అధ్యక్షులందరూ కలిసి డిస్ట్రిబ్యూటరీ చైర్మన్, వైస్ చైర్మన్ తో పాటు 6గురు సభ్యులను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు.

కేసీ కెనాల్ డిస్ట్రిబ్యూటరీ కమిటీ చైర్మన్‌గా ధనిరెడ్డి రామచంద్రారెడ్డి



ధనిరెడ్డి రామచంద్రారెడ్డిని సన్మానిస్తున్న దృశ్యం

ప్రొద్దుటూరు ,డిసెంబరు 17 (ఆంధ్రజ్యోతి) : కేసీ కెనాల్ డిస్ట్రిబ్యూటరీ కమిటీ చైర్మన్‌గా కొర్రపాడుకు చెందిన ధనిరెడ్డి రామచంద్రారెడ్డి ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఆమేరకు పీడబ్ల్యూ కార్యాలయంలో ఎన్నికల అధికారులు వారికి ధృవపత్రాలు అందజేశారు. ప్రొద్దుటూరు, రాజుపాళెం, చాపాడు మండలాలకు చెందిన కేసీ కెనాల్ పరిధిలోని సాగునీటి సంఘాల అధ్యక్షులు అందరూ కలిసి డిస్ట్రిబ్యూటరీ కమిటీ చైర్మన్‌గా ధనిరెడ్డి రామచంద్రారెడ్డిని, వైస్ చైర్మన్‌గా నారపురెడ్డి లక్ష్మీనారాయణ రెడ్డిలను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు.

దువ్వూరు...



పత్రాలు అందుకుంటున్న హరినాథ్

దువ్వూరు డిసెంబరు 17 (ఆంధ్రజ్యోతి) : సాగునీటి సంఘాల డిస్ట్రిబ్యూటరీ కమిటీ చైర్మన్ ఎన్నిక మంగళ వారం కేసీ కెనాల్ కార్యాలయంలో జరిగింది. కేసీ కెనాల్ 10వ నెంబరు పరిధిలో ఆరునీటి సంఘాలువున్నాయి. వీటిలో ఆయకట్టు నీటి సంఘాల అధ్యక్షులు నరసింహ్మయ్య, హరినాద్, రామసుబ్బారెడ్డి, సీవీ సుబ్బారెడ్డి, లోకేష్ రెడ్డి, శివరామకృష్ణారెడ్డి ఎన్నికయ్యారు. వీరందరితో ఎన్నికల అధికారి రాజేంద్రప్రసాద్ సహాయ ఎన్నికల అధికారిపుల్లయ్య సమావేశం ఏర్పాటుచేసి డిస్ట్రిబ్యూటరీ చైర్మన్, వైస్‌చైర్మన్ ఎన్నిక నిర్వహించారు. దువ్వూరు నీటి సంఘాల అధ్యక్షుడు కోనేటి హరినాథ్, చియ్యపాడు చెందిన శివరామకృష్ణారెడ్డి ఉపాధ్యక్షుడు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు, ఈ మేరకు ఎన్నికల అధికారులు ధృవీకరించారు.

ఆంధ్రజ్యోతి పాఠకులకు గమనిక

ఆంధ్రజ్యోతి కొత్త చందాదారులుగా చేరదలచుకున్న వారు, పేపరు పంపిణీ విషయంలో ఎలాంటి సమస్యలు ఎదురైనా ఈ క్రింది ఫోన్ నెంబర్లను సంప్రదించగలరు.

ప్రొద్దుటూరు - A.C.O.:	జమ్మలమడుగు - S.R.:	మైదుకూరు - S.R.:	బద్వేల్ - S.R.:	A.C.M. :
99854 11466	94404 72816	91334 42886	99666 83437	99854 11184